TITLE CODE: APTEL16281
తెలుగు దినపత్రిక
# పీపుల్స్ మోటివేషన్
People's Motivation
ఆంధ్రప్రదేశ్ / తెలంగాణ

సంపుటి : 01 | సంచిక : 95 | ఎడిటర్ : ఎం. రమేష్ | బుధవారం, మార్చి 6, 2024 | పేజీలు : 08 | వెల రూ. 5.00/-

## అవినీతిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటే



- కాళేశ్వరమే ఇందుకు ప్రబల ఉదాహరణ
- వరుసగా రెండోరోజూ కాంగ్రెస్‌పై విమర్శలు
- సంగారెడ్డి వేదికగా పలు అభివృద్ధి పనులకు శ్రీకారం
- ప్రజలంతా నాకుటుంబ సభ్యులే అన్న ప్రధాని మోడీ

2



## ఎన్నికల తరవాత విశాఖే రాజధాని

- ఇక్కడే సీఎంగా ప్రమాణం చేస్తా
- విశాఖ అభివృద్ధికి కట్టుబడి ఉన్నా
- విశాఖ రాకుండా అడ్డంకుల సృష్టి
- విశాఖ విజన్ సదస్సులో సీఎం జగన్ సంచలన వ్యాఖ్యలు

విజన్ విశాఖ సదస్సులో సీఎం జగన్ మోహన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత వైజాగ్ నుంచే పాలన చేపడతామన్నారు. మళ్లీ గెలిచిన తర్వాత వైజాగ్‌లోనే ప్రమాణ స్వీకారం చేస్తానని అదే తన కమిట్‌మెంట్ అంటూ కామెంట్ చేశారు. విశాఖలో విజన్ విశాఖ సదస్సు ఆంధ్రప్రదేశ్ సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రారంభించారు. ఓప్రైవేటు హోటల్‌లో రెండు రోజుల పాటు కార్యక్రమం జరగనుంది. మొదటి రోజు సదస్సును ప్రారంభించిన సీఎం జగన్ వైజాగ్ వనరులను పారిశ్రామికవేత్తలకు వివరించారు. దేశంలోని మిగతా నగరాలతో పోల్చుకుంటే వైజాగ్ చాలా త్వరగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు.. స్థిరత్వమైన ప్రభుత్వం ఉందని అభివృద్ధితో కూడిన సంక్షేమాన్ని ప్రజలకు అందిస్తున్నామని వివరించారు. అదే టైంలో వ్యవసాయానికి ప్రాధాన్యత ఇస్తున్నట్టు వివరించారు. రాష్ట్రానికి విశాఖ చాలా ముఖ్యమైన బ్యాక్ బోన్‌గా ఉండబోతోందని అన్నారు. భవిష్యత్‌లో హైదరాబాద్ కంటే వైజాగ్ అభివడద్ధి చెందుతుందని జగన్ అభిప్రాయపడ్డారు.

- పీపుల్స్ మోటివేషన్, విశాఖపట్టణం

2



# ముగిసిన ప్రధాని మోడీ రెండ్రోజుల పర్యటన

- హైదరాబాద్ నుంచి ఒడిషా కు వెళ్లిన మోడీ
- బేగంపేటలో ఘనంగా వీడ్కోలు పలికిన గవర్నర్, సిఎం రేవంత్

హైదరాబాద్, మార్చి5(పీపుల్స్ మోటివేషన్) :

తెలంగాణలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రెండు రోజుల పర్యటన ముగిసింది. సాయంత్రం సంగారెడ్డి నుంచి బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న మోదీకి గవర్నర్ తమిళిసై, సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌లు వీడ్కోలు పలికారు. ఆపై బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి ఒరిస్సాకు ప్రధాని బయలుదేరి వెళ్లారు. రాష్ట్రంలో రెండు రోజుల పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి పనులకు మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. సోమవారం ఆదిలాబాద్‌లో పర్యటించిన మోదీ.. రూ. 6 వేల కోట్ల విలువైన పలు ప్రాజెక్టులను ప్రధాని ప్రారంభించారు. అంబారీ – ఆదిలాబాద్ – పింపాలకుట్టీ రైల్వే విద్యుద్దీకరణను జాతికి అంకితం చేశారు. మంచిర్యాల జిల్లా రామగుండంలోని ఎన్టీపీసీ రెండో థర్మల్ పవర్ యూనిట్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. అలాగే మంగళవారం ఉదయం సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాంకాళీ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి సంగారెడ్డికి బయలుదేరి వెళ్లిన ప్రధాని పటాన్‌చెరులోని పటేల్ గూడ చేరుకుని పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. దాదాపు రూ. 7వేల కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అక్కడ ఏర్పాటు చేసిన సభలో మోదీ ప్రసంగించారు. అనంతరం సంగారెడ్డి నుంచి బయలుదేరి బేగంపేట విమానాశ్రయానికి చేరుకుని అక్కడి నుంచి ఒరిస్సాకు ప్రధాని మోదీ పయనమయ్యారు. కాగా... ప్రధాని మోదీ పర్యటనకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దూరంగా ఉండగా... ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం పాత ఆనవాయితీని కొనసాగించారు. ఆదిలాబాద్ సభలో పాల్గొనడమే గాకుండా ప్రధానిని పెద్దన్నయ్యగా సీఎం సంబోధించారు. అయితే రేవంత్ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేతలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటేనంటూ బీఆర్ఎస్ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. బీఆర్ఎస్ విమర్శలకు కాంగ్రెస్ కౌంటర్ అటాక్‌కు దిగింది.








## విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ.. ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా..? బాధ్యతాయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా..? అయితే రండి... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

పీపుల్స్ మోటివేషన్ తెలుగు దినపత్రికలో

నియోజకవర్గ ఇంచార్జ్‌లు
మండల రిపోర్టర్‌లు కావలెను..

సంప్ర : 80086 22746

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation

# వైసీపీకి గుమ్మానురు జయరామ్ రాజీనామా

- గుంతకల్ నుంచి టీడీపీ తరపున పోటీ చేస్తా
- వైసిపిలో ఇక ఉండలేనన్న గుమ్మనూరు జయరామ్

**అనంతపురం, మార్చి5(పీపుల్స్ మోటివేషన్) :**

ఆంధ్రప్రదేశ్ మంత్రి, వైసీపీ సీనియర్ నేత గుమ్మనూరు జయరామ్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. 12 ఏళ్లుగా వైఎస్ఆర్ కాంగ్రెస్ జెండా మోసాను. పార్టీలో కష్టపడి రెండుసార్లు ఎమ్మెల్యే ,మంత్రిని అయ్యాను. నా వ్యక్తిగత నిర్ణయం మేరకు రాజీనామా చేస్తున్నా. మంత్రి పదవికి కూడా రాజీనామా చేస్తున్నా. చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరబోతున్నట్లు ప్రకటించారు. బిసి సభలో టీడీపీ జాయిన్ అవుతున్నట్లు వెల్లడించారు. నియోజకవర్గ ప్రజల అభీష్టం మేరకు పార్టీని వీడుతున్నట్లు తెలిపారు.. నేను ఎప్పుడు తప్పు చేయలేదు. నాకు సహకారం లేదు అందుకే పార్టీకి రాజీనామా చేస్తున్నాను. 151 గడప ఉన్న చిన్న ప్లలెటూరు నుంచి ఎమ్మెల్యే అయ్యాను. ప్రజల కష్టసుఖాలను చూసి ఈ స్థాయికి వచ్చా. నా నియోజకవర్గ ప్రజలకు న్యాయం చేయాలనే ఉన్నా. నన్ను 2019లోనే కర్నూలు ఎంపిగా పోటీ చేయాలని చెప్పినా వద్దని ఎమ్మెల్యే గా పోటీ చేశా. ఎంపిగా పోటీ చేయడం నాకు ఇష్టం లేదు అందుకే పార్టీకి రాజీనామా చేస్తున్నా. నా నియోజకవర్గం వదిలి వెళ్లాలని వైసీపీ చెప్పింది నాకు నచ్చలేదు. రెండు జిల్లాల్లో పోటీ చేయడానికి టీడీపీ నుంచి ఆఫర్ వచ్చింది. టీడీపీ అభ్యర్థిగా అనంతపురం జిల్లా గుంతకల్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న. మా సామాజిక వర్గంలో నేను పుట్టిన ఊరు కావడంతో గుంతకల్ నుంచి పోటీ చేస్తున్న. కాంగ్రెస్ పార్టీకి వెళ్ళాలని నేను ఏ రోజు అనుకోలేదు. నేను మాస్ లీడర్ ని నా అనుకున్నా నాకు న్యాయం జరగలేదు. 14 నియోజకవర్గంలో ఎవరికి ఎక్కడ న్యాయం జరిగిందో చూడండి. కర్నూలు జిల్లా పదవులు మొత్తాన్ని ఒక లీడర్స్ అంతా ఎస్సీలను, బోయాలను పదవుల నుంచి తప్పించారు. కర్నూలు జిల్లాలో ఒక సామాజిక వర్గాన్ని ఎందుకు తప్పించలేదు. నాకు 2022 వరకు జీసస్, అల్లా యేసు అన్ని జగన్ . జగన్ ఒక విగ్రహంలా మారారు మేము ఏమి చెప్పినా వినిపించడం లేదు. జగన్ అనే శిల్పానికి ఇద్దరు పూజారులు చెప్పేది వేదంలా ఉంది. సజ్జల రామ కృష్ణా రెడ్డి, దనునంజయ రెడ్డి ఇద్దరు కలిసి ఒక వర్గానికి మాత్రమే కొమ్ము కాస్తున్నారు. పూజారులు ఇద్దరు కలిసి భక్తులుగా ఉన్న మమ్మల్ని వదిలేసి వారసులను వెనకేసుకొస్తున్నారు. నా పక్క నియోజకవర్గం ఆలూరు అభివృద్ధి చెందలేదు కానీ , నా పక్క నియోజకవర్గం డోన్ మాత్రం అభివృద్ధి చెందింది. నా నియోజకవర్గం పనులకు సంబంధించి బిల్స్ ఇప్పటి వరకు విడుదల చేయలేదు. ధనుంజయ రెడ్డి వైసీపీ కోసం పని చేస్తున్నారు. నేను మళ్ళీ తిరిగి వైసీపీకి రాను నేను అజాత శత్రువును నాకు ఎవరితోనూ శతృత్వం లేదని జయరామ్ వివరించారు.

# తాగుబోతు భర్త వీరంగం

- నడిరోడ్డులో భార్యను నరికేసిన దుండుగడు

**నంద్యాల, మార్చి5(పీపుల్స్ మోటివేషన్) :**

అనుమానం ఆమె ప్రాణాలను తీసింది. మూడు ముళ్ళు వేసిన చేతులతోనే వేటు వేశాడు. ఏడు అడుగులు నడిచి జీవితాంతం తోడుంటా అన్న భర్త ఆమె పాలిట కాలయముడు అయ్యాడు. పట్టపగలే అందరూ చూస్తుండగానే నడిరోడ్డుపై భార్యను నరికేసి చంపాడు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన అత్తను గాయపరిచాడు. నంద్యాల జిల్లా అవుకు పట్టణంలోని కోటవీధిలో రంగస్వామి కుమారి దంపతులు నివాసం ఉండేవారు. రంగస్వామి మొదటి భార్య నుంచి విడాకులు తీసుకొని రెండో పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఒక కుమారుడు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రంగస్వామి తాగుడుకు బానిసై అనుమానంతో నిత్యం భార్యను వేధించేవాడు. భర్త పెడుతున్న ఇబ్బందులు తట్టుకోలేక భార్య కుమారి పుట్టింటికి వెళ్ళిపోయింది. పుట్టింటికి వెళ్ళిన కూడా భర్త వేధింపులు ఆగలేదు. దీంతో కుమారితోపాటు ఆమె చిన్నమ్మ సుబ్బలక్ష్మమ్మ అవుకు మండలం కేంద్రానికి చేరుకొని రంగస్వామిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న రంగస్వామి బస్టాండ్ సమీపంలో ఉన్న కుమారిపై పక్కనే ఉన్న టెంకాయలు కొట్టే కత్తితో విచక్షణరహితంగా నరికాడు. రక్తపు మడుగులో ఉన్న కుమారిని స్థానికులు, ఆమె తరుపు బంధువులు స్థానిక ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం నంద్యాలకు తరలిస్తుండగా కుమారి మార్గమధ్యలోనే మృతి చెందింది. రంగస్వామిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

# రికార్డ్ స్థాయిలో బీఏపీఎస్ టెంపుల్ సందర్శన

**అబుదాబి, మార్చి5(పీపుల్స్ మోటివేషన్) :**

అబుదాబిలో నిర్మించిన తొలి హిందూ దేవాలయంసందర్శనకు ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున పోటెత్తారు. ఫిబ్రవరి 14న ప్రధాని మోడీ చేతుల మీదుగా ఈ ఆలయం ప్రారంభమైంది. గత నెలాఖరు వరకు వీఐపీలకు ఆలయ అధికారులు అనుమతి ఇచ్చారు. మార్చి 1 నుంచి ప్రజల సందర్శనార్థం అనుమతి ఇచ్చారు. దీంతో పెద్ద ఎత్తున ప్రజలుతరలివచ్చారు. గత ఆదివారం ఒక్కరోజే 65 వేల మంది ప్రజలు సందర్శించి రికార్డ్ సృష్టించింది. ఇక కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ కూడా ఆలయ ప్రారంభ రోజున ఆలయాన్ని సందర్శించి దాదాపు మూడు గంటల అక్కడే గడిపారు. పాలరాతితో నిర్మించిన ఆలయం అద్భుతంగా ఉందని కొనియాడారు. ఆలయాన్ని సందర్శించిన భక్తులు కూడా ఆలయ నిర్మాణాన్ని మెచ్చుకుంటున్నారు. యూఏఈలో నిర్మించిన తొలి హిందూ ఆలయాన్ని అద్భుతంగా నిర్మించారని కితాబు ఇస్తున్నారు. అలాగే ఆలయం దగ్గర పని చేస్తున్న వాలంటీర్ల సేవ కూడా బాగుందని మెచ్చుకుంటున్నారు. యూఏఈ ప్రభుత్వ పెద్దలు ఆలయం నిర్మాణం కోసం స్థలాన్ని కేటాయించారు. దీంతో భారత్ నుంచి వచ్చిన కళాకారుల చేత ఈ హిందూ దేవాలయాన్ని నిర్మాణం చేశారు. గత నెల 13, 14 తేదీల్లో ప్రధాని మోడీ యూఏఈలో పర్యటించారు. రెండ్రోజుల పర్యటనలో భాగంగా ఫిబ్రవరి 14న మోడీ ఈ ఆలయాన్ని ప్రారంభించారు.

# ఎన్నికల తరవాత విశాఖే రాజధాని





- ఇక్కడే సీఎంగా ప్రమాణం చేస్తా
- విశాఖ అభివృద్ధికి కట్టుబడి ఉన్నా
- విశాఖ రాకుండా అడ్డంకుల సృష్టి
- విశాఖ విజన్ సదస్సులో సీఎం జగన్ సంచలన వ్యాఖ్యలు

**విశాఖపట్టణం,మార్చి5(పీపుల్స్ మోటివేషన్) :**

విజన్ విశాఖ సదస్సులో సీఎం జగన్ మోహన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత వైజాగ్ నుంచే పాలన చేపడతామన్నారు. మళ్లీ గెలిచిన తర్వాత వైజాగ్‌లోనే ప్రమాణ స్వీకారం చేస్తానని అదే తన కమిట్‌మెంట్ అంటూ కామెంట్ చేశారు. విశాఖలో విజన్ విశాఖ సదస్సు ఆంధ్రప్రదేశ్ సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రారంభించారు. ఓ ప్రైవేటు హోటల్‌లో రెండు రోజుల పాటు కార్యక్రమం జరగనుంది. మొదటి రోజు సదస్సును ప్రారంభించిన సీఎం జగన్ వైజాగ్ వనరులను పారిశ్రామికవేత్తలకు వివరించారు. దేశంలోని మిగతా నగరాలతో పోల్చుకుంటే వైజాగ్ చాలా త్వరగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు.. స్థిరత్వమైన ప్రభుత్వం ఉందని అభివృద్ధితో కూడిన సంక్షేమాన్ని ప్రజలకు అందిస్తున్నామని వివరించారు. అదే టైంలో వ్యవసాయానికి ప్రాధాన్యత ఇస్తున్నట్టు వివరించారు. రాష్ట్రానికి విశాఖ చాలా ముఖ్యమైన బ్యాక్ బోన్‌గా ఉండబోతోందని అన్నారు. భవిష్యత్‌లో హైదరాబాద్ కంటే వైజాగ్ అభివదద్ధి చెందుతుందని జగన్ అభిప్రాయపడ్డారు. విభజనలో భాగంగా హైదరాబాద్ కోల్పోయామని దాని ప్రభావం నేటికీ ఉంటోందన్నారు. ఓవైపు అభివృద్ధిని కొనసాగిస్తూనే ముఖ్యమైన వ్యవసాయ రంగాన్ని కూడా ఉరకలు పెట్టిస్తున్నామన్నారు. ప్రస్తుతం వ్యవసాయం ఏపీలో 70 శాతం వృద్ధిని నమోదు చేసిందన్నారు. చాలా రంగాల్లో దేశంలోని ఇతరరాష్ట్రాలతో పోలిస్తే ఏపీ మెరుగైన స్థానంలో ఉందన్నారు సీఎం జగన్. ఉత్పత్తి రంగంలో దేశంలోనే ఏపీ టాప్‌లో ఉందని వివరించారు. ఇలాంటి వాటన్నింటికీ పోర్టులు, ఇతర రవాణా సౌకర్యల తోడ్పాటు అందిస్తున్నారని తెలిపారు. ఇప్పటికే రామాయపట్నం, కాకినాడ, మూలపేట, మచిలీపట్నం, పోర్టులు రాష్ట్రాభివృద్ధికి సాయపడుతున్నాయని వివరించారు. ఈ క్రమంలోఎన్నికల తరువాత తాను విశాఖలో ఉంటానని సీఎం చెప్పారు. మళ్ళీ రెండవసారి ముఖ్యమంత్రిగా తాను విశాఖలోనే ప్రమాణస్వీకారం చేస్తానని స్పష్టం చేశారు. తాను విశాఖ వచ్చేందుకు అనేకసార్లు ప్రయత్నించిన రానివ్వలేదని తెలిపారు. కోర్ట్ కేసులు, కొన్ని మీడియా సంస్థలు విష ప్రచారం చేశాయన్నారు. భూ కబ్జాలు, అరాచకాలు అని ప్రచారం చేశారని మండిపడ్డారు. సీఎం వైజాగ్‌లో ఉంటే విశాఖ బాగా అభివృద్ధి చెందుతుందన్నారు. తాను ఒక్కడినే విశాఖను కార్యనిర్వహక రాజధానిగా చేయాలనుకున్నానని.. ప్రతిపక్షం మొత్తం వ్యతిరేకించిందని తెలిపారు. అమరావతిలో మౌలిక సదుపాయాల కల్పనకు లక్ష కోట్లు అవుతుందని టీడీపీ ప్రభుత్వమే చెప్పిందంటూ జగన్ అన్నారు. అమరావతిలో ఎకరానికి మౌలిక సదుపాయాల కల్పనకు ఎకరాకు రూ.2 కోట్లు అవుతుందని డీపీఆర్ ఇచ్చారని సీఎం చెప్పారు. విశాఖలో రోడ్లు ఉన్నాయని... మంచి హోటల్స్ ఉన్నాయన్నారు. సెక్రటేరియట్ విశాఖలో అయితే ఐకానిక్ టవర్స్ కట్టవచ్చని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో నాలుగు పోర్ట్‌లు అతి వేగంతో నిర్మాణం జరుగుతున్నాయని ముఖ్యమంత్రి చెప్పారు. తాను విశాఖ వచ్చేందుకు తెగ ప్రయత్నం చేశానని విశాఖ వాసులను జగన్ నమ్మించే యత్నాలు చేశారు. నాలుగుసార్లు ముహూర్తం పెట్టీ మరీ సీఎం వాయిదా వేసుకున్నారు. సీఎం వస్తే అందరూ వైజాగ్ వస్తారని... అప్పుడు దానంతట అదే అభివృద్ధి చెందుతుందంటూ ముఖ్యమంత్రి జగన్ చెప్పారు. వైజాగ్ రాడిసన్ బ్లూ హోటల్ లో విజన్ విశాఖ సదస్సులో సీఎం పాల్గొనగా.. 2,000 మందికి పైగా పారిశ్రామికవేత్తలు హాజరయ్యారు. విశాఖ అభివృద్ధి బాగా చెందుతోందని.. హైదరాబాద్ కంటే మిన్నగా వైజాగ్ అభివృద్ధి చెందుతుందన్నారు. దేశంలోనే వ్యవసాయ రంగంలో ఏపీలో 70 శాతం వృద్ధి సాధించిందని.. ఉత్పత్తి రంగంలో దేశంలోనే ఏపీ మెరుగ్గా ఉందన్నారు. అభివృద్ధిలో విశాఖ నగరం దూసుకెళ్తోందని.. అలాగే రామాయపట్నం, కాకినాడ, మూలపేట, మచిలీపట్నం పోర్టులు కీలకంగా మారాయన్నారు. గత ఐదేళ్లలో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని.. ఏపీలో తలసరి ఆదాయం పెరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలు హైదరాబాద్‌కే పరిమితమయ్యాయన్నారు. ప్రతి సంక్షేమ పథకాన్ని పారదర్శకంగా అమలు చేస్తున్నామని.. డీబీటీ పద్ధతి ద్వారా నేరుగా లబ్ధిదారులకు నగదును అందజేస్తున్నామన్నారు. ఏపీలో మహిళల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని.. సముద్ర తీరంలో పోర్టులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఏపీలో నిరుద్యోగం తగ్గింది.. ఉపాధి అవకాశాలు పెరిగాయన్నారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలతో 30 లక్షల ఉద్యోగాలు వచ్చాయని.. స్వయం ఉపాధి అవకాశాలు మెరుగయ్యాయన్నారు. స్వయం సహాయక బృందాల పెండింగ్ రుణాలను మాఫీ చేశామన్నారు. బెంగళూరు కంటే వైజాగ్‌లో సదుపాయాలు మెరుగ్గా ఉన్నాయని.. కొన్ని మీడియా సంస్థలు ప్రభుత్వంపై బురద జల్లుతున్నాయన్నారు. ప్రతిపక్షానికి లబ్ధి కలిగించేలా కథనాలు ఇస్తున్నాయని.. నాయకుడి ఆలోచన తప్పుగా ఉంటే అభివృద్ధి చెందదన్నారు. స్వార్థ ప్రయోజనాల వల్ల విశాఖ ప్రయోజనాలు దెబ్బతింటున్నాయి.. విశాఖ ఇంకా చాలా అభివృద్ధి చెందాల్సి ఉందన్నారు. అమరావతి రాజధానికి తాము వ్యతిరేకం కాదని.. అమరావతి శాసన రాజధానిగా కొనసాగుతోందన్నారు. అమరావతిలో మౌలిక సదుపాయాల కల్పనకు లక్ష కోట్లు కావాలని.. విశాఖ నగరాన్ని అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. విశాఖ స్టేడియాన్ని మెరుగ్గా నిర్మిస్తామన్నారు. ఎన్నికల తర్వాతే విశాఖలోనే ఉంటానని.. నగరంలో దేశాన్ని ఆకర్షించే ఐకానిక్ సెక్రటేరియట్ నిర్మిస్తామన్నారు. విశాఖను ఎకనామిక్ గ్రోత్ ఇంజిన్‌లా మారుస్తామన్నారు.. విశాఖ విషయంలో తనకు ఉన్న కమిట్మెంట్ ఇది అన్నారు. విశాఖ రాబోయే రోజుల్లో విశ్వనగరంగా మారుతుందని.. పరిపాలనా రాజధానికి కావాల్సిన అన్ని హంగులు విశాఖకు ఉన్నాయని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చెప్పుకొచ్చారు. ముఖ్యమంత్రి వైజాగ్‌లో ఉంటే విశాఖ బాగా అభివృద్ధి చెందుతుందన్నారు.

# బిఆర్ఎస్‌కు వరుస దెబ్బలు

- పార్టీని వీడుతున్న నాయకులు
- పార్లమెంట్ ఎన్నికలు లక్ష్యంగా జారుకుంటున్న నేతలు

**హైదరాబాద్, మార్చి5(పీపుల్స్ మోటివేషన్) :**

తెలంగాణలో అధికారాన్ని కోల్పోయిన తర్వాత బీఆర్ఎస్ పార్టీకి వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. బీఆర్ఎస్ లో పదవులు అనుభవించిన నేతలు ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్నారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండటంతో...నేతలంతా తమ దారి తాము చూసుకుంటు న్నారు. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలనే సామెతను పక్కాగా అనుసరిస్తున్నారు. కష్టకాలంలో పార్టీకి అండగా ఉండాల్సిన నేతలంతా...పక్క చూపులు చూస్తున్నారు. వారంరోజుల వ్యవధిలో ఇద్దరు ఎంపీలు బీజేపీ కండువా కప్పేసుకున్నారు. ఇద్దరు సిట్టింగ్ ఎంపీలు పోతుగంటి రాములు, జహీరబాద్ ఎంపీ బీబీ పాటిల్... పార్టీకి రాంరాం చెప్పేశారు. వారిద్దరూ బీజేపీ కండువా కప్పుకోవడం జరిగిపోయింది. బీబీ పాటిల్‌కు జహీరాబాద్ పార్లమెంట్ స్థానం, ఎంపీ రాములు తనయుడు భరత్‌కు నాగర్‌కర్నూలు ఎంపీ సీటు కేటాయించింది. వీరిద్దరు మొదటి జాబితాలోనే టికెట్ దక్కించుకున్నారు. మరికొందరు నేతలు కాషాయ పార్టీ తీర్థం పుచ్చుకునేందుకు రెడీ ఉన్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. వర్ధనపేటకు చెందిన ఆరూరి రమేశ్, వరంగల్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ గుండు సుధారాణి కూడా కారు వీడేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే పట్నం మహేందర్ రెడ్డి దంపతులు, తీగల కృష్ణారెడ్డిలు పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. బద్రాచలం ఎమ్మెల్యే కూడా కారు దిగేందుకు రెడీ అయ్యారు. ఈ క్రమంలో ఒక్కొక్కరుగా జారు కుంటున్నట్లు తెలుస్తోంది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికలలో భారత రాష్ట్ర సమితి పార్టీ ఓటమి పాలయింది. మూడోసారి అధికారంలోకి వస్తామని భావించిన గులాబీ పార్టీ అంచనాలు తలకిందులు అయ్యాయి. మళ్ళీ అధికారంలోకి రావడం ఖాయమంటూ కొందరు నేతలు లెక్కలు వేసుకున్నారు. కేసీఆర్ కూడా మూడోసారి గెలుస్తామని చెప్పడంతో...ఇతర పార్టీల నుంచి పలువురు నేతలు ముందుకు వెనుక ఆలోచించకుండా కారు ఎక్కేశారు. గులాబీ పార్టీ ఓవర్ లోడ్ అని తెలిసినా...అధికారంలోకి వస్తే పదవులు వస్తాయన్న ఆశతో కండువా కప్పేసుకున్నారు. ఎన్నికల్లో కాంగ్రెసు పార్టీ అధికారంలోకి రావడంతో...రాజకీయ పరిణామాలు చకచకా మారిపోతున్నాయి. పార్టీ అధికారంలో ఉన్న ఎమ్మెల్యే, ఎంపీ పదవులు అనుభవించిన నేతలు... ఒక్కొక్కరుగా మెల్లిగా కారు పార్టీకి గుడ్ చెప్పేస్తున్నారు. ఇటు కేంద్రం...అటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీలలోకి నేతలు జంప్ అవుతున్నారు. ఇద్దరు ఎంపీలు బీజేపీలో చేరడం...అంతకుముందు పలువురు ఎమ్మెల్యే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశం కావడంతో కారు పార్టీలో కలవరం మొదలైనట్లు తెలుస్తోంది. ఇక ముందు కూడా వలసలు ఇలాగే కొనసాగుతాయా అన్న చర్చ బీఆర్ఎస్ పార్టీలో మొదలైంది. పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసే వరకు...వలసలు ఏ స్థాయికి చేరుకుంటాయన్నది చర్చనీయాంశంగా మారింది. తాజాగా పలువురు ఎమ్మెల్యేలు కూడా ఇతర పార్టీల్లోకి వెళ్తారన్న ప్రచారం జోరుగా జరుగుతోంది. అధికారంలో ఉన్నప్పుడు పదవులు ఎంజాయ్ చేసిన నేతలు...గులాబీ పార్టీకి గుడ్ బై చెబుతున్నారు. అయితే ఎంత మంది నేతలు వెళు తున్నా...బీఆర్ఎస్ హైకమాండ్ పెద్దగా స్పందించడం లేదు. దీనికి కారణాలు ఉన్నాయని సొంత పార్టీ నేతలు చెబుతున్నారు. పార్టీ వీడే నేతలను బుజ్జగించాల్సిన అవసరం లేదని, అధికారం లేనప్పుడు పార్టీలో కొనసాగే ఆలోచన లేని నేతలు...బయటకు పోతే మంచిదని యోచనలో హైకమాండ్ ఉంది. అధికార కాంగ్రెస్ కూడా బిఆర్ఎస్‌ను ఖాళీ చేయించే పనిలో ఉంది. బిఆర్ఎస్‌ను దెబ్బతీసే పనిలో బిజెపి కూడా ఉంది.

# హైకోర్టులో శ్రీనివాసగౌడ్‌కు చుక్కెదురు

- సెక్యూరిటీ పెంచాలన్న వినతికి తిరస్కరణ

**హైదరాబాద్, మార్చి5(పీపుల్స్ మోటివేషన్) :**

మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్‌కు హైకోర్టులో చుక్కెదురైంది. తనకు 4 ప్లస్ 4 గన్ మెన్‌లను కేటాయించాలంటూ శ్రీనివాస్ గౌడ్ హైకోర్టులో పిటిషన్ వేశారు. తనకు ప్రాణ హాని ఉందని పిటిషన్‌లో పేర్కొన్నారు. శ్రీనివాస్ గౌడ్ వేసిన పిటిషన్ మంగళవారం విచారణకు రాగా... మాజీ మంత్రి అభ్యర్థనను ధర్మాసనం నిరాకరించింది. ప్రతి ఒక్కరికి ఈ విధంగా కేటాయించడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. శ్రీనివాస్ గౌడ్‌కు గన్‌మెన్‌లు అవసరమో లేదో తెలపాలని డీజీపీకి హైకోర్టు ఆదేశించింది. కౌంటర్ దాఖలు చేయాలని డీజీపీని హైకోర్టు ఆదేశిస్తూ... తదుపరి విచారణను మార్చ్ 19కి వాయిదా వేసింది.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation



# అవినీతిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటే





- కాళేశ్వరమే ఇందుకు ప్రబల ఉదాహరణ
- వరుసగా రెండోరోజూ కాంగ్రెస్‌పై విమర్శలు
- సంగారెడ్డి వేదికగా పలు అభివృద్ధి పనులకు శ్రీకారం
- ప్రజలంతా నాకుటుంబ సభ్యులే అన్న ప్రధాని మోడీ

**సంగారెడ్డి, మార్చి5(పీపుల్స్ మోటివేషన్) :**

కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందన్న కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు అందులో భాగస్వామి అవుతోందని ప్రధాని మోడీ ఘాటు విమర్శలు చేశారు. అవినీతిలో బిఆర్ఎస్ కాంగ్రెస్ ఒక్కటేనని వరుసగా రెండోరోజూ తెలంగాణ వేదికగా ప్రధాని మోడీ విమర్శలు గుప్పించారు. కాళేశ్వరం అవినీతిపై విచారణ చేయాల్సి ఉండగా.. తొక్కిపెట్టేందుకు చూస్తోందని కాంగ్రెస్‌పై సంగానరెడ్డి వేదికగా విమర్శలు గుప్పించారు. కాళేశ్వరంలో జరిగిన అవినీతిపై విచారణలో కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదన్నారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదు. ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో కూడా ఏమీ జరగదని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు. సోమవారం ఆదిలాబాద్‌లో చేసిన విమర్శలనే సంగారెడ్డిలోనూ చేశారు. బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. కుటుంబ పార్టీలను నమ్మకోవద్దని, వాటికి వేర్వేరు ముఖాలు ఉండవచ్చునని, కానీ, ఉమ్మడి లక్షణం మాత్రం దోచుకోవడం.. అబద్దాలు చెప్పడమని దుయ్యబట్టారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఒకటేనని ఆరోపించారు. ఇకపోతే ప్రజలతంతా తన కుటుంబం అన్నారు. మోడీ కుటుంబంలో మీరంతా భాగస్వాములని అన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం నిరంతరంగా కృషి చేస్తున్నదని ప్రధాని మోదీ అన్నారు. సోమవారం ఆదిలాబాద్‌లో రూ.56 వేల కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభించామని, నేడు సంగారెడ్డి నుంచి మరో రూ.7 వేల కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించామని చెప్పారు. రాష్ట్రాల అభివృద్ధే దేశ అభివృద్ధి అని నమ్ముతామని తెలిపారు. సంగారెడ్డి జిల్లా పటేల్‌గూడలో రూ.9021 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని బేగంపేటలో సివిల్ ఏవియేషన్ రీసెర్చ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఇది దేశంలోనే మొదటదని వెల్లడించారు. ఈ కేంద్రం ద్వారా హైదరాబాద్, తెలంగాణకు గుర్తింపు వస్తుందని చెప్పారు. ఏవియేషన్ కేంద్రం.. స్టార్టప్‌లు, నైపుణ్య శిక్షణకు వేదికగా నిలుస్తుందన్నారు. గత పదేండ్లలో దేశంలో విమానాశ్రయాల సంఖ్య రెట్టింపయిందని చెప్పారు. పలు కొత్త రైలు మార్గాలు, విద్యుదీకరణ పనులు చేపట్టామని తెలిపారు. ఘట్‌కేసర్-లింగపల్లి ఎంఎంటీఎస్ రైలు సర్వీసు ఇప్పటికే ప్రారంభమైందని గుర్తుచేశారు. పెట్రోలియం ఉత్పత్తుల రవాణాకు పారాదీప్ నుంచి హైదరాబాద్‌కు పైప్‌లైన్ పనులు చేపట్టామన్నారు. దేశంలోని 140 కోట్ల మంది ప్రజలు వికసిత్ భారత్ నిర్మాణానికి కట్టుబడి ఉన్నారని ప్రధాని అన్నారు. వికసిత్ భారత్ కోసం మౌలిక సౌకర్యాల కల్పన ఆవశ్యకమని చెప్పారు. మౌలిక సౌకర్యాల కోసం బడ్జెట్‌లో రూ.11 లక్షల కోట్లు కేటాయించామని వెల్లడించారు. సంగారెడ్డి నుంచి మదీనగూడ వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టామని తెలిపారు. దీనిద్వారా తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక మధ్య అనుసంధానత ఏర్పడుతుందన్నారు. దక్షిణ భారత్‌కు గేట్‌వేలా తెలంగాణ నిలుస్తుందని చెప్పారు. పటాన్ చెరులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కుటుంబ పార్టీల పాలనపై ప్రధాని మోదీ ఘాటు వ్యాఖ్యలు చేశారు. మోదీ మాట్లాడుతూ.. వారసత్వ రాజకీయాలను నేను వ్యతిరేకిస్తున్నాను. కుటుంబపార్టీల కారణంగా ప్రతిభ ఉన్నవారికి అన్యాయం జరుగుతోంది. యువతకు ఉపాధి అవకాశాలు దొరకడం లేదు. అవినీతిని బయట పెడుతున్నాననే అక్కసుతో కాంగ్రెస్ నాపై విమర్శలు చేస్తోంది. కుటుంబ పాలన సాగించే వారిలో అభద్రత భావం పెరిగిపోయింది. వారసత్వ నేతలకు భయం పట్టుకుంది. కుటుంబ పార్టీల నేతలు సొంత ఖాజానాను నింపుకుంటున్నారు. కుటుంబ పాలకుల అవినీతి దళాన్ని వెలికితీస్తున్నాం. ప్రజల నమ్మకాన్ని నేనెప్పుడూ వమ్ము కానివ్వను. ఇక్కడ దోచుకున్న నల్లధనం దాచుకోవడానికి విదేశాల్లో ఖాతాలు తెరిచారని వ్యాఖ్యానించారు. అయోధలో రామమందిరం నిర్మిస్తామని చెప్పాం. ప్రపంచం గర్వించే రీతిలో అయోధ్యలో శ్రీరాముడి ప్రతిష్టాపన జరిగింది. దేశంలో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు కుటుంబ పార్టీల పాలన కొనసాగుతోంది. కుటుంబ పార్టీల పాలనలో ఉన్న చోట వారి కుటుంబాలే బాగుపడ్డాయి. కుటుంబపార్టీలకు దోచుకోవడానికి ఏమైనా లైసెన్స్ ఉందా? అని ప్రశ్నించారు. పటాన్ చెరులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ 'మీ ప్రేమను ఎప్పటికీ మర్చిపోలేను. మీ ప్రేమను తెలంగాణ అభివృద్ధి రూపంలో చూపిస్తా. విదేశాల్లో చాలామంది తెలుగువారు ఉన్నారు. విదేశాల్లో మనవాళ్లను చూస్తుంటే గర్వంగా ఉంది. జమ్మూకశ్మీర్ లో ఆర్టికల్ 370ని రద్దు చేశాం. బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకుందని అన్నారు. ఈ క్రమంలో తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గవర్నర్ తమిళసై, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిలు పాల్గొన్నారు.

# బీజేపీలో మల్కాజిగిరి సీటు చిచ్చు

- ఎందరో ఆశలను తుంచేశారని వ్యాఖ్యలు
- భవిష్యత్ కార్యాచరణ తెలియచేస్తానన్న మురళీధర్ రావు

**హైదరాబాద్, మార్చి5(పీపుల్స్ మోటివేషన్) :**

మల్కాజిగిరి లోక్‌సభ అభ్యర్థిగా మాజీమంత్రి ఈటెల రాజేందర్ ఎంపికలో బీజేపి అధిష్ఠానం అవలంబించిన తీరుపై పార్టీలో చిచ్చు రేగుతోంది. అలాగే పార్టీలో చేరిన వెంటనే ఎంపి సీట్లు కేటాయించడంపైనా అసంతృప్తి వెల్లడవుతోంది. ముఖ్యంగా మల్కాజిగిరి సీటుపై మురళీధర్‌రావు అనుచరులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈటలకు టికెట్ కేటాయించినట్లు ప్రకటన వెలువడిన తర్వాత మురళీధర్‌రావు ఓ ట్వీట్ చేయడంతో కలకలం రేగింది. 'మల్కాజిగిరిలో నా కోసం పనిచేసిన వారికి ధన్యవాదాలు.. త్వరలోనే అనుచరులు, కార్యకర్తలను వ్యక్తిగతంగా కలుస్తా, ఆపై భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తా' అని ఆయన ట్వీట్ చేశారు. మల్కాజిగిరి టికెట్ కోసం బీజేపీ మధ్యప్రదేశ్ ఇన్‌చార్జి మురళీధర్‌రావు, జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ ఎం.కొమురయ్య, సీనియర్ నాయకులు చాడ సురేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, తూళ్ల వీరేందర్‌గౌడ్, మల్లారెడ్డి, పన్నాల హరీష్ రెడ్డి, సామ రంగారెడ్డి ప్రయత్నాలు చేశారు. గత లోక్‌సభ ఎన్నికలో ఇక్కడి నుంచి మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచందర్‌రావు పోటీ చేశారు. ఈ సారి పోటీకి ఆయన ఆసక్తి చూపలేదు. మల్కాజిగిరి టికెట్ తనకే ఇస్తానని అధిష్టానం హామీ ఇవ్వడంతో మురళీధర్‌రావు నియోజకవర్గం లో అనేక కార్యక్రమాలు చేపడుతూ ప్రచారం చేసుకుంటున్నారు. ఓటర్ల ఎన్‌రోల్ మెంట్ కోసం ప్రత్యేకంగా కార్యాలయం ఏర్పాటుచేశారు. చాయ్‌పే చర్చ కార్యక్రమాలతో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహించారు. డిజిటల్ హిందూ కార్యక్రమాలను నిర్వహించారు. ఫిర్ ఏక్ బార్ మోదీ పేరుతో కార్నర్ మీటింగ్‌లు నిర్వహించారు. టికెట్ ఖరారు చేసే రోజు కూడా మూసాపేటలో అభిమానులు, అనుచరులతో సమావేశం నిర్వహించారు. పార్టీ సిద్ధాంతాల కోసం పనిచేస్తున్న వారికి టికెట్ ఇవ్వడం లేదంటూ సోషల్ మీడియాలో కార్యకర్తలు, అనుచరులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టికెట్ ఆశించి భంగపడ్డ సీనియర్ నాయకులు ఎన్నికల్లో అభ్యర్థికి సహకరించకూడదని నిర్ణయించినట్టు సమాచారం. ఈ మేరకు వారు ఇటీవల ఓ సమావేశం నిర్వహించినట్టు తెలిసింది. హైదరాబాద్ లోక్‌సభ స్థానాన్ని విరించి ఆస్పత్రి చైర్మన్, లతా మా ఫౌండేషన్ చైర్‌పర్సన్ మాధవీలతకు కేటాయించడంతో కొంతమంది అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పార్టీ నాయకులను కాదని, ఇతరులకు టికెట్ ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ స్థానం నుంచి గతంలో రెండుసార్లు పోటీ చేసిన భగవంత్‌రావు, మాజీ డిప్యూటీ మేయర్ సుభా?షచందర్‌జీ, పొన్న వెంకటరమణ, రూప్‌రాజ్ టికెట్ ఆశించారు. ఈసారి టికెట్ భగవంత్‌రావు, సుభాష్ చందర్‌జీలో ఎవరికో ఒకరికి ఇస్తారని ఊహించారు. చివరకు మాధవీలతకు కేటాయించారు. మాధవీలత ఎంపికపై ఎమ్మెల్యే రాజాసింగ్ కూడా అసంతృప్తిగా ఉన్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది. రాజాసింగ్ హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గానికి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు.

# డీసీసీబీ ఛైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి రాజీనామా

- సొంతపార్టీ డైరెక్టర్ల అవిశ్వాసంతో ఖంగుతిన్న నేత

**నిజామాబాద్, మార్చి5(పీపుల్స్ మోటివేషన్) :**

జిల్లా డీసీసీబీ ఛైర్మన్ పదవికి పోచారం భాస్కర్ రెడ్డి రాజీనామా చేశారు. సొంత పార్టీ డైరెక్టర్లే అవిశ్వాస తీర్మానం నోటీస్ ఇవ్వటంతో భాస్కర్ రెడ్డి రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. డీసీసీబీకి చెందిన మొత్తం 20 మంది డైరెక్టర్లలో 15 మంది అవిశ్వాస నోటీసులు ఇవ్వడంతో.. బీఆర్ఎస్ లో మరో సారి విభేదాలు బయటపడ్డాయి. భాస్కర్ రెడ్డి రాజీనామాను ఆమోదిస్తారా.. అవిశ్వాస పరీక్ష పెడతారా?.. అనే విషయంపై ఉత్కంఠ నెలకొంది. కాగా, తమను లెక్కచేయకుండా.. ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడంతోనే పోచారం భాస్కర్ రెడ్డి తీరుపై డైరెక్టర్లు అసంతృప్తిగా ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఆయనపై అవిశ్వాసం తీర్మానానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇటీవల జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ బీఆర్ఎస్ కు రాజీనామా చేసి బీజేపీలో చేరడంతో.. బీఆర్ఎస్ తరుపు నుంచి ఎంపీగా పోటీ చేసేందుకు భాస్కర్ రెడ్డి ప్రయత్నిస్తున్న క్రమంలో.. ఆయనపై సొంత పార్టీ డైరెక్టర్ల నుంచి వ్యతిరేకత రావడంతో భాస్కర్ రెడ్డికి షాక్ తగిలింది. మాజీ స్పీకర్ పోచారం తనయుడే భాస్కర్ రెడ్డి కావడంతో జిల్లా రాజకీయాల్లో ఉత్కంటకు తెరలేచింది.

# సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ఈసీ సిద్ధం

**న్యూఢిల్లీ, మార్చి5(పీపుల్స్ మోటివేషన్) :**

సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సన్నద్ధమైంది. మార్చి 13న పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ రిలీజ్ అవుతుందని వార్తలు వస్తున్నాయి. లోక్ సభ ఎన్నికలతోపాటు కొన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని ఇప్పటికే ఈసీ ప్రకటించింది. 2019లో సార్వత్రిక ఎన్నికలకు మార్చి 10న షెడ్యూల్ విడుదలైంది. ఏప్రిల్ 11 నుంచి మే 19 వరకు ఏడు విడతల్లో పోలింగ్ నిర్వహించారు. మే 23 ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. ఇప్పుడు ఇంచుమించు ఇదే విధంగా షెడ్యూల్ ఉంటుందని భావిస్తున్నారు. ప్రధాని మోదీ మార్చి 12 వరకు వివిధ రాష్ట్రాల్లో పర్యటన కొనసాగుతుంది. ఇప్పటికే తెలంగాణ నుంచి ఈ టూర్ కు శ్రీకారం చుట్టారు. మార్చి 4న తెలంగాణ, తమిళనాడులో పర్యటించారు. మార్చి 5న తెలంగాణలోనే పర్యటన చేస్తున్నారు. ఆ తర్వాత మరో 10 రాష్ట్రాలు , కేంద్ర పాలిత ప్రాంతాలకు వెళ్లనున్నారు. వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. అలాగే పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు. ప్రధాని మోదీ రాష్ట్రాల పర్యటన మార్చి 12తో ముగుస్తుంది. ఆ తర్వాత రోజే సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతుందని వార్తలు వస్తున్నాయి.

# 4 వందేభారత్ ట్రైన్లపై రాళ్ల దాడి

## కర్ణాటక, ఏపీలో జరిగిన ఘటనలు

**న్యూఢిల్లీ, మార్చి5(పీపుల్స్ మోటివేషన్) :**

భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చని సెమీ హైస్పీడ్ రైల్ "వందేభారత్ ఎక్స్‌ప్రెస్" తరుచుగా దాడులకు గురవుతోంది. గుర్తుతెలియని వ్యక్తులు రైలు ప్రయాణిస్తున్న సమయంలో రాళ్లతో దాడులు చేస్తున్నారు. ఇప్పటి వరకు దేశంలోని పలు ప్రాంతాల్లో ఇలాంటి ఘటనలు నమోదయ్యాయి. తాజాగా నైరుతి రైల్వే(ఎస్‌డబ్ల్యూఆర్) జోన్ గుండా వెళ్తున్న 4 వందేభారత్ ట్రైన్లపై ఆదివారం రాళ్ల దాడి జరిగింది. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లోని వేర్వేరు ప్రాంతాల్లో గుర్తు తెలియని వ్యక్తులు దాడులు చేశారని అధికారులు మంగళవారం తెలిపారు. ఈ దాడుల్లో ప్రయాణికులకు, సిబ్బంది ఎలాంటి గాయాలు కాలేదని, అయితే, రైళ్ల కిటికీ అద్దాలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు.రాళ్లదాడికి సంబంధించి ఒక్కో ఘటనపై మూడు వేర్వేరు కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. మొదటి సంఘటన ఉదయం 6.15 గంటలకు చిక్కబాణవర రైల్వే స్టేషన్ దాటిన తర్వాత ధర్వాడ్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌పై దాడి జరిగింది. మధ్యాహ్నం 3.20 గంటలకు ధర్వాడ్ నుంచి బెంగళూర్ సిటీ జంక్షన్ వరకు నడుస్తున్న రైలుపై జరిగింది. మూడో ఘటన సాయంత్రం 4.30 గంటలకు మైసూర్ జంక్షన్ నుంచి చెన్నై సెంట్రల్ వెళ్తున్న రైలుపై ఏపీలోని కుప్పం స్టేషన్ వచ్చే ముందు రాళ్లతో దాడి చేశారు. నాలుగో ఘటన రాత్రి 8 గంటలకు ఏపీలోని అనంతపురం జిల్లా ధర్మవరం జంక్షన్ సమీపంలో జరిగిందని అధికారులు వెల్లడించారు. నిందితులను పట్టుకునేందుకు దర్యాప్తు జరుగుతోందని అధికారులు చెప్పారు.

# ప్రొఫెసర్ సాయిబాబా నిర్దోషి

## మావోయిస్ట్ సంబంధాలను తోసిపుచ్చిన హైకోర్టు నిర్దోషజగా విడుదల చేస్తూ ఆదేశాలు

**ముంబై, మార్చి5(పీపుల్స్ మోటివేషన్) :**

మావోయిస్టులతో సంబంధాల కేసులో ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ సాయిబాబాకు భారీ ఊరట లభించింది. సాయిబాబాతో పాటు మరో ఐదుగురిని బాంబే హైకోర్టు నిర్దోషులుగా ప్రకటించింది. ఆయనకు విధించిన జీవిత ఖైదును రద్దు చేస్తూ మంగళవారం న్యాయస్థానం తీర్పు వెల్లడించింది. దీంతో కొన్నేళ్లుగా జైలులో ఉన్న సాయిబాబా త్వరలో నాగ్‌పూర్ సెంట్రల్ జైలు నుంచి విడుదల కానున్నారు. ఢిల్లీ యూనివర్సిటీలో ప్రొఫెసర్ గా పనిచేస్తున్న సాయిబాబాను 2017లో గడ్చిరోలి సెషన్స్ కోర్టు దోషిగా తేల్చింది. దేశంపై యుద్ధం చేసే కార్యకలాపాలకు పాల్పడినందుకు దోషులుగా నిర్ధారించింది. అప్పటినుంచి ఆయన జైలులోనే ఉంటున్నారు. అయితే సెషన్స్ కోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ సాయిబాబా, ఇతరులు చేసిన అప్పీల్‌పై బాంబే హైకోర్టు నేడు తీర్పు వెలువరించింది. నాగ్‌పూర్ సెషన్స్ కోర్టు తీర్పును న్యాయమూర్తులు వినయ్ జోషి, వాల్మీకి ఎస్ఏ మెనెజెస్‌లతో కూడిన ధర్మాసనం కొట్టివేసింది. నిందితులపై కేసును నిరూపించడంలో ప్రాసిక్యూషన్ విఫలమైందని న్యాయమూర్తులు వినయ్ జోషి, వాల్మీకి ఎస్ఏ మెనెజెస్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. యాభై నాలుగేళ్ల సాయిబాబా వీల్‌చైర్‌కే పరిమితమైన దివ్యాంగుడు. ఢిల్లీ విశ్వవిద్యాలయంలోని రామ్ లాల్ ఆనంద్ కళాశాలలో ఇంగ్లీష్ ప్రొఫెసర్‌గా సాయిబాబా చాలాకాలం పనిచేశారు. మావోయిస్టులతో సంబంధాలున్నట్టు ఆరోపణలపై జైలుపాలు కావడంతో 2021 ఫిబ్రవరిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగం నుంచి ఆయనను తొలగించారు. ఈ క్రమంలో ఆయన కోర్టులోనే పోరాడారు. మావోయిస్టు లింక్ కేసులో జిఎన్ సాయిబాబా, హేమ్ మిశ్రా, మహేష్ టిర్కీ, విజయ్ టిర్కీ, నారాయణ్ సాంగ్లికర్, ప్రశాంత్ రాహి, పాండు నరోటే (మరణించారు)లను బాంబే హైకోర్టు నాగ్‌పూర్ బెంచ్ నిర్దోషులుగా ప్రకటించింది. హైకోర్టు గతంలో నిర్దోషిగా విడుదల చేసిన ఉత్తర్వును సుప్రీంకోర్టు కొట్టివేయడంతో సాయిబాబా అప్పీల్‌ను బాంబే హైకోర్టు మళ్లీ విచారించింది. జస్టిస్ వినయ్ జోషి, జస్టిస్ వాల్మీకి ఎస్ఏతో కూడిన ధర్మాసనం తీర్పును వెల్లడించింది. మావోయిస్టు సంబంధాల కేసులో ఢిల్లీ యూనివర్శిటీ మాజీ ప్రొఫెసర్ జిఎన్ సాయిబాబాతో పాటు మరో ఐదుగురు నిందితులను బాంబే హైకోర్టు నాగ్‌పూర్ బెంచ్ నిర్దోషులుగా ప్రకటించింది.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation

# తెలంగాణలో బయట పడుతున్న నీటికష్టాలు

- ఇంతకాలం దాచినా ఇప్పుడు దాగని అవస్థలు
- సాగునీటి కోసం అన్నదాతల ఆందోళన

**సిద్దిపేట, మార్చి5(పీపుల్స్ మోటివేషన్) :**

వేసవి కాలం మొదలు అయ్యిందో లేదో.. అప్పుడే నీటికటకటలు మొదలయ్యాయి. ఇంతకాలం సమస్యలను బయటకు రాకుండా దాచారు. మిషన్ కాకతీయతో చెరువులు ఉబికి వస్తున్నాయని బుకాయించారు. ఎండాకాలంలోనూ మత్తళ్లు దుముకుతున్నాయని ప్రచారం చేసుకున్నారు. మరి ఈ మూడు నెల్లలోనే పాతాల గంగ అదృశ్యమయ్యిందా అన్న రీతిలో నీటి సమస్యలు తన్నుకు వస్తున్నాయి. ఈ క్రమంలో అన్నదాతలకు అవస్థలు మొదలయ్యాయి. వ్యవసాయానికి అవసరమయ్యే సాగు నీటికి ఇప్పటినుండే ఇబ్బందులకు గురవుతున్నారు. ఏ ప్రభుత్వాలు వచ్చినా తమను మాత్రం గుర్తించడం లేదని తమ సమస్యలను తీర్చడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో పంటలు పంచడించలేమని అన్నదాత అందోళన చెందుతున్నరు. ఉమ్మడి మెదక్ జిల్లా అంటేనే వ్యవసాయ అధారిత జిల్లా ఎక్కడ పండించే పంటలు దేశం మొత్తం ఎగుమతి చేస్తారు. దేశానికే ధాన్య బండగరంలా ఉన్న జిల్లా ప్రస్తుతం నీటి వనరులు లేక వ్యవసాయ సాగుకు అంతరాయం ఏర్పడింది. గత ప్రభుత్వం లక్ష ఎకరాలకు నీటిని అందించే ఉద్దేశ్యంతో ప్రాజెక్టు నిర్మించినా అవి చివరి దశకు చేరకపోవడంతో తిరిగి సాగునీటిని ఆటంకం ఏర్పడే పరిస్థితి నెలకొంది. కనీసం ఈ ప్రభుత్వం అయినా ప్రాజెక్టులను పూర్తి చేయాలని కోరుతున్నారు. గగతంలో తాము ఆందోళన చేసినా పట్టించు కోలేదని, సరికాదా అణచివేసారని ఆందోళన చెందుతున్నారు. సిద్దిపేట జిల్లాలో సాగునీటి కోసం రైతన్నలు రోడ్డు ఎక్కారు. దుబ్బాక మండలం మల్లాయి పల్లి రైతులు పొలాల వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. మల్లన్నసాగర్ నుండి వచ్చే కెనాల్ 50 మీటర్లు పూర్తి చేసి ఉంటే వందల ఎకరాల వరి పంట సాగు అయ్యేదని పూర్తిగా పంటలు ఎండిపోయాయని నిరసన చేస్తూన్నారు. ప్రభుత్వానికి, అధికారులకు వ్యతిరేకంగా పంట పొలాల వద్ద రైతుల ఆందోళన బాటపట్టారు. సిద్దిపేట నియోజకవర్గం చిన్నకోడూరు మండలం ఎల్లాయిపల్లి రైతులు వ్యవసాయానికి సాగునీరు ఇవ్వాలంటూ ధర్నా చేస్తున్నారు. రాజీవ్ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్‌లను అసంపూర్తిగా చేపట్టడం, వాటిలో నీటిని నింపకపోవడంతో రైతులకు నష్టం చేకూరుతోంది.

# ఉజ్జయిని మహంకాళిని దర్శించుకున్న మోడీ

- ప్రధాని రాక సందర్భంగా సికింద్రాబాద్‌లో భారీ భద్రత





**హైదరాబాద్, మార్చి5(పీపుల్స్ మోటివేషన్) :**

రెండోరోజు తెలంగాణలో పర్యటిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రధానమంత్రి రానున్న వేళ అధికారులు సికింద్రాబాద్ మొత్తం కట్టిదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఆలయం మొత్తం నిఘా నీడలోకి వెళ్లిపోయింది. పన్నెండు అంచెల భద్రతను ఏర్పాటుచేశారు. ప్రధానమంత్రి పూజలు చేసే సందర్భంలో ఇద్దరిని మాత్రమే ఆలయంలోకి అనుమతించారు. ఈ క్రమంలో సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రధాని మోదీ అమ్మవారికి మోదీ ప్రత్యేక పూజలు చేశారు. రాజ్‌భవన్ నుంచి బయలుదేరి సికింద్రాబాద్ వెళ్లిన ప్రధాని మోదీ అక్కడ మహంకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రధానితో పాటు ముఖ్యులకు మాత్రమే ఆలయంలోకి అనుమతించారు. ఆలయం చుట్టు పక్కల ప్రాంతాల్లో భారీ భద్రత ఏర్పాటు చేశారు. ఆలయ అర్చకులు ప్రధాని మోదీకి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శనం తరువాత హారతి అందజేశారు. శాలువాతో ప్రధానిని సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని ఇచ్చి, వేద ఆశీర్వదం అందజేశారు. సికింద్రాబాద్ మహంకాళి ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్న తర్వాత ప్రధాని మోదీ.. సంగారెడ్డి జిల్లాకు బయలుదేరారు. ముందుగా బేగంపేట విమానాశ్రయానికి చేరుకుని అక్కడి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో సంగారెడ్డి చేరుకున్నారు. అక్కడ రూ.9 వేల 21 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు వర్చువల్‌గా చేసారు. రూ.1409 కోట్ల రూపాయలతో నిర్మించిన ఎన్‌హెచ్-161 నాందేడ్ అఖోలా నేషనల్ హైవేని జాతికి అంకితం చేసారు ప్రధాని మోదీ. ఈ పర్యటన కోసం నిన్న ప్రధాని రాజ్ భవన్ లోనే బస చేశారు. ఆయన కోసం రాజ్ భవన్ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పటిష్టమైన భద్రత ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు.

# విమర్శలకూ ఓ హద్దుండాలి !

దొంగే దొంగా..దొంగా అన్నట్లుగా ఇప్పుడు బిఆర్ఎస్ తెలంగాణలో విమర్శలు చేయడంలో ముందు వరసలో నిలిచింది. పథకం ఏదైనా దానిపై విమర్శలు చేయడం మొదలు పెట్టింది. తెలంగాణను దోచుకున్న ఓ కుటుంబ సభ్యులు ఇప్పుడు అధికారం దక్కక పోవడంతో వచ్చిన ఉక్కపోతను భరించలేకపోతున్నారు. ఈ ప్రభుత్వంపై అప్పుడే వ్యతిరేకత వచ్చిందని నంగనాచి కబుర్లు చెబుతున్నారు. పదేళ్లపాటు ప్రజలపై స్వారీ చేసి, వారిని అణచివేసి, తెలంగాణ ఆకాంక్షలను తుంగలో తొక్కి, పెద్దమనుషులుగా చెలామణి అయిన వారే ఇప్పుడు...అధికారలేమితో ఆయాసపడుతున్నారు. కాళేశ్వరంపై కేంద్రం ఓ కమిటీని అధ్యయనం కోసం ఏర్పాటు చేసింది. ప్రాజెక్ట్ సమర్థతపై అధ్యయనం చేయనుంది. ఇదంతా కూడా రాష్ట్ర అభ్యర్థన మేరకు నిర్ణయం తీసుకున్నారు. అలాగే కాళేశ్వరంపై హైకోర్టులో జ్యుడిషియల్ విచారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్ వేసింది. ఇవన్నీ తెలిసి కూడా బిఆర్ఎస్ యాగీ చేస్తోంది. కానీ ప్రధాని మోడీ కూడా పరిస్థితి, నిజాలు తెలిసికూడా విమర్శలు చేయడం ఆయన పదవికి హుందాగా లేదనే చెప్పాలి. 'కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందన్న కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఏం చేస్తోందని అంటూ ఆదిలాబాద్ వేదికగా చేసిన విమర్శలు ప్రధాని మోడీ అవగాహనా రాహిత్యాన్ని బయటపెట్టాయి. కాళేశ్వరం అవినీతిపై విచారణ చేయాల్సి ఉండగా.. తొక్కిపెట్టేందుకు చూస్తోందని చెప్పడం ద్వారా పచ్చి అబద్దాలు వల్లించారు. బీఆర్ఎస్‌తో కుమ్మక్కు అవుతోందని,కాళేశ్వరంలో జరిగిన అవినీతిపై మీరు తిన్నారంటే మీరు తిన్నారంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఒకరిపై మరొకరు ఆరోపణలు గుప్పించుకుంటున్నారని చేసిన వ్యాఖ్యలు సత్యదూరం కాక మరోటి కాదు. ఎందుకంటే కాళేశ్వరంలో జరిగిన అవినీతే కాదు...అక్రమ, నాసిరకం కట్టడం పై కాంగ్రెస్ అధికారం చేపట్టిన వెంటనే చర్యలకు పూనుకుంది.కానీ కేంద్రం ఈ విషయంలో కెసిఆర్‌ను వెనకేసుకుంటూ వచ్చింది. అవినీతీ కేసుల్లో రక్షణ ఇచ్చింది. ఇక్కడ కెసిఆర్, అక్కడ జగన్‌లను అవినీతి కేసుల్లో రక్షిస్తూ మోడీ మాట్లాడడం గురివింద సామెతను గుర్తు చేస్తోంది. నిజానికి బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదు. ఇది పదేపదే మోడీ ప్రస్తావించారు. మరి తీసుకున్న చర్యలు ఏమైనా ఉన్నాయంటే శూన్యం. ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో కూడా ఏమీ జరగదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమర్శించడం ద్వారా తన హోదాను తక్కువ చేసుకున్నారు. బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేసిన ప్రధాని తెలంగాణకు చేసిన మేలేంటో చెప్పివుంటే బాగుండేది. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఒకటేనని ఆరోపించే ముందు నిజాలు తెలుసుకుంటే మంచిది. రాజకీయ విమర్శలు చేసేముందు తమ హోదాను గుర్తు పెట్టుకుంటే మంచిది. నిజానికి నీళ్లు నిధులు, నియామకాల నినాదంతో ఎన్నో ఉద్యమాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం 2014లో ఏర్పాటయింది. దాదాపు దశాబ్దంపాటు ఏలిన కల్వకుంట్ల కుటుంబం తెలంగాణను నిలువునా మోసం చేసింది. ప్రాజెక్టుల పేరుతో అప్పనంగా దోచేసుకున్నారు. ఉమ్మడి ఎపిలో అదే నినాదాన్ని ఎన్నికల ఆయుధంగా మలుచుకొని మరికొన్ని ఆకర్షణీయమైన హామీలతో నాటి తెలంగాణ రాష్ట్ర సమితి అధికారంలోకి వచ్చింది. తెలంగాణ సమాజం నూతనంగా ఏర్పడ్డ రాష్ట్రం నుండి, మరీ ముఖ్యంగా ఉద్యమాల నుంచి ఉద్భవించిన కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణను అద్భుతంగా పునర్నిర్మిస్తుందని అందరూ ఆశించారు. కానీ అప్పులు చేసి ప్రజలను వంచించారని తేలింది. అభివృద్ధి కోసమే అప్పులు చేశామని నమ్మబలికారు. కేవలం ఓ కుటుంబం కోసం తెలంగాణను తెచ్చుకున్నట్లు అయ్యింది. పది సంవత్సరాల కేసీఆర్ ప్రభుత్వ పాలన తర్వాత నేడు వెనక్కి చూస్తే ఎంతగా మోసపో యామో తెలుసుకుని ఆశ్చర్యపడాల్సి వస్తోంది. కాళేశ్వరం పేరుతో ఎంత దగా చేశారో కళ్లకు కడుతోంది. ఈ అవినీతిని గత పదేళ్లలో పదేపదే వల్లించిన మోడీ ఏనాడూ కెసిఆర్‌పై లేషమాత్రం చర్యకు కూడా దిగలేదు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టివేసి అన్ని వ్యవస్థలను విధ్వంసంచేసి తెలంగాణను తిరోగమనం లోకి తీసుకెళ్ళిందని విమర్శలు చేసిన బిజెపి పెద్దలు తీసుకున్న చర్యలేమిటో చెప్పాలి. ఇవేవీ చేయకుండా ఇప్పుడే అధికారం చేపట్టి, అవినీతి బూజు దులుపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బిఆర్ఎస్‌తో పోల్చడం దిగజారుడు రాజకీయాలకు పరాకాష్టగా చూడాలి. ఉమ్మడి రాష్ట్రంలో మొదలైన పలు సాగునీటి ప్రాజెక్టులు వివిధ దశలలో ఉన్నా...వాటిని పూర్తిచేసే బాధ్యతను పక్కనపెట్టి, రీడిజైనింగ్ పేరుతో నిర్మాణ వ్యయాన్ని పెంచి, కాళేశ్వరం లాంటి తెల్లల ఏనుగులను సృష్టించిన అపర విశ్వామిత్రుడు మన కెసిఆర్. ప్రాణహిత- చేవెళ్ల ఎత్తిపోతల ప్రాజెక్టును పక్కన పెట్టి కాళేశ్వరంతో దాదాపు లక్ష కోట్లు బూడిదలో పోశారు. అందిన కాడికి దోచుకున్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనే ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు కావలసిన అన్ని అనుమతులను కేంద్ర ప్రభుత్వం నుంచి పొంది సుమారు రూ.38 వేల కోట్ల వ్యయంతో పూర్తి చేసేందుకు పూనుకున్నది. కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ ప్రాజెక్టు పేరును కాళేశ్వరం ఎత్తిపోతల పథకంగా మార్చి, పూర్తిస్థాయిలో రీడిజైనింగ్ కార్యక్రమం మొదలు పెట్టింది. కేసీఆర్ ప్రభుత్వం తానే నియమించిన నిపుణుల కమిటీ సిఫార్సులను పూర్తిగా నిర్లక్ష్యం చేసి, మేడిగడ్డ ప్రాంతంలో బ్యారేజ్ కట్టాలని నిర్ణయించి ముందుకు వెళ్ళడం, ఇప్పుడది ఏ రూపంలో ఉందో ప్రపంచానికి తెలిసి వచ్చింది. దీనిపై కేంద్రం ఏనాడైనా చర్య తీసుకుందా అంటే లేదు. ఎందుకంటే లోపాయకారి అవగాహన అని చెప్పక తప్పదు. మరి అలాంటి వారు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం ద్వారా ప్రజలకు ఏం సందేశం ఇవ్వబోతున్నారు. బిఆర్ఎస్‌తో లోపాయకారి ఒప్పందం కారణంగానే లిక్కర్ కేసులో కవితను దాచిపెట్టారని ప్రజలు గుర్తించలేదని అనుకుంటున్నారా..?కాగ్ నివేదిక ప్రకారం కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టును పూర్తి చేయాలంటే మరొక 50,000 కోట్లు అవసరం ఉంటుందని స్పష్టమవుతుంది. అంతేకాకుండా ఇప్పటికే ఖర్చు చేసిన లక్ష కోట్ల పెట్టుబడికి ఎలాంటి ఫలితం రాలేదని అర్థమవుతుంది. వీటితో పాటు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం అశాస్త్రీయమైనదని ఆర్థికంగా లాభసాటి కాదని స్పష్టంగా కాగ్ నివేదికలో పేర్కొనబడింది. కాగ్ నివేదిక అంతా కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోనిదే కదా..దీనిపై ప్రధాని మోడీ ఎందుకు అధ్యయనం చేయలేదో చెప్పాలి. కాళేశ్వరం లాంటి ప్రాజెక్టుల్లో అవినీతి జరిగిందని తెలిసినా మిన్నకున్న కేంద్రం ఇప్పుడు కొత్తగా వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని విమర్శించడం ద్వారా అభాసుపాలయ్యిందే తప్ప మరోటి లేదు. రాజకీయాల్లో హుందాతనం అలవర్చుకుంటే మంచిదని మోడీ లాంటి వారు గుర్తించాలి.

# కాంగ్రెస్‌కు తలనొప్పిగా సర్దుబాటు

- ఒక్కసీటు కోసం పట్టుదలతో సిపిఐ

**హైదరాబాద్, మార్చి5(పీపుల్స్ మోటివేషన్) :**

తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికల వాతావరణం వేడెక్కుతోంది. బిజెపి 9 సీట్లకు అభ్యర్థులను ప్రకటించింది. కాంగ్రెస్ కేవలం అధికారికంగా ఒక్కసీటులో అభ్యర్థి పేరును తెలిపింది. బిఆర్ఎస్ 4 సీట్లకు అభ్యర్థులను ప్రకటించింది. ఈ క్రమంలో ఏ క్షణంలో అయినా ఎన్నికల నోటిఫికేషన్ రానుంది. కాంగ్రెస్‌లో ఆశావహులు పెరిగారు. నాగర్ కర్నూలు నుంచి మల్లురవి తాను పోటీ చేయడం ఖాయమని అంటున్నారు. ఖమ్మం సీటు కోసం పలువురు పోటీపడుతున్నారు. సిపిఐకి ఇప్పుడు సీటు కేటాయించడం కాంగ్రెస్‌కు తలనొపపిగా మారింది. కాంగ్రెస్‌తో పొత్తులో ఉన్న సీపీఐ.. ఖమ్మంఎంపీ సీట్‌పై ఆశలు పెట్టుకుంది. పొత్తులో భాగంగా ఎంపీ సీటు ఇవ్వాలని కాంగ్రెస్‌ని సీపీఐ కోరుతుంది. ఈమేరకు తెలంగాణలో 5 ఎంపీ స్థానాలు ప్రతిపాదించింది సీపీఐ. ఖమ్మం, నల్గొండ, భువనగిరి, వరంగల్, పెద్దపల్లి ఎంపీ సీట్లలో ఏదో ఒక సీటు కేటాయించాలని కాంగ్రెస్‌కి తెలంగాణ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విజ్ఞప్తి చేశారు. ప్రతిపాధించిన 5 ఎంపీ స్థానాల్లో ఒక్కటైన ఇస్తుందని ఆశిస్తున్నట్లు కూనంనేని చెప్పారు. ఖమ్మంలో పార్లమెంటరీ నియోజకవర్గ స్థాయి జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హాజరయ్యారు. రాష్ట్రంలోని మిగిలిన స్థానాలతో పోలిస్తే ఈ ఐదు ఎంపీ సీట్ల పరిధిలో బలంగా ఉన్నామని సీపీఐ చెప్తోంది. కాంగ్రెస్ సహకరించి ఒక సీటు కేటాయిస్తే.. గెలుస్తామని ధీమా వ్యక్తం చేస్తుంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో పొత్తు పెట్టుకుని ఒక సీటు కేటాయించినట్టే.. ఇప్పుడు ఎంపీ ఎన్నికల్లోనూ ఒక సీటు కేటాయించాలని కోరుతోంది. ఒక్క సీటైనా ఇచ్చేలా ఒప్పిస్తామని చెప్తున్నారు కూనంనేని. కమ్యూనిస్టులు ఉంటేనే ఇండియా కూటమికి బలం అని తమకు పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క ఎంపీ స్థానామైన ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇండియా కూటమిలో భాగంగా తమిళనాడులో సీపీఐకి డీఎంకే రెండు సీట్లు కేటాయించిందని గుర్తు చేశారు. అలాగే రాష్ట్రంలో బీఆర్ఎస్ మనుగడ రోజురోజుకి తగ్గిపోతుందని చెప్పారు. బీఆర్ఎస్ ప్లేస్‌ను బీజేపీ భర్తీ చేసేందుకు చేస్తున్న ప్లాన్స్‌ని కాంగ్రెస్ తిప్పికొట్టాలని చెప్పారు. సీపీఐ పొత్తుతో కాంగ్రెస్‌కి మరింత బలం చేకూరుతుందని కూనంనేని సాంబశివరావు చెప్పారు. మొత్తంగా కాంగ్రెస్‌లో ఇప్పుడు ఆశావహులు పెరిగారు. 17 సీట్లలో కూడా అంతా పోటీలో ఉన్నారు. ఒక్కో సీటులో కనీసం పదిమంది రంగంలో ఉన్నారు. ఈక్రమంలో సిపిఐని సర్దుబాటు చేయడం కాంగ్రెస్ పార్టీకి అంత సులువు కాదు.

# మేమంతా మోడీ కుటుంబమే

- లాలా వ్యాఖ్యలపై స్మృతి ఇరానీ విమర్శలు

**నాగ్‌పూర్, మార్చి5(పీపుల్స్ మోటివేషన్) :**

ప్రధాని మోదీకి కుటుంబం లేదని, పిల్లలు లేరని ఆర్జేడీ అధినేత లాలు ప్రసాద్ యాదవ్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. బీజేపీ నేతలు, కేంద్రమంత్రులు వరసగా లాలు ప్రసాద్ యాదవ్‌కు కౌంటర్ ఇస్తున్నారు. మేమంతా ప్రధాని మోదీ కుటుంబ సభ్యుల అని చెబుతున్నారు. సోషల్ మీడియా ఎక్స్ బయోలో పేరు తర్వాత బ్రాకెట్‌లో 'మోదీ కా పరివార్' అని రాస్తున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, మరో కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా రాశారు. ఆ జాబితాలో కేంద్రమంత్రి స్మృతి ఇరానీ చేరారు. నాగ్‌పూర్‌లో జరిగిన బీజేపీ నమో యువ మహా సమ్మేళనలో స్మృతి ఇరానీ పాల్గొన్నారు. 'మేమంతా ప్రధాని మోదీకుటుంబ సభ్యులం. ఆయనకు అండగా ఉంటాం. ఇచ్చిన హామీలను మోదీ నెరవేర్చారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆర్టికల్ 370 రద్దు, రామమందిర నిర్మాణం, మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు చేశాం. మీ లాగా కుంభకోణాలు చేయలేదు. దాణా కుంభకోణం చేసిన దొంగ లాలు ప్రసాద్ యాదవ్ అని' స్మృతి ఇరానీ తీవ్రస్థాయిలో విరుచుకు పడ్డారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై స్మృతి ఇరానీ మండిపడ్డారు. గత పదేళ్ల యూపీఏ పాలన - పదేళ్ల మోదీ హయాంలో జరిగిన అభివృద్ధిని చూడాలని రాహుల్ గాంధీని కోరారు. పదేళ్లలో నిరుపేదలు, మహిళలు, రైతుల జీవితాల్లో సమూల మార్పులు జరిగాయని వివరించారు. తమ ప్రభుత్వం చేపట్టిన సంస్కరణల ఫలితాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని స్మృతి ఇరానీ స్పష్టం చేశారు.

# లక్షలాది మంది అర్హులకు అన్యాయం

- ఒక్క యూనిట్ ఎక్కువ వచ్చినా మొత్తం బిల్లు వసూలు
- బిల్లింగ్ వ్యవస్థలో మార్పులు చేయాలి
- సీఎం రేవంత్ రెడ్డికి హరీష్ రావు బహిరంగ లేఖ

**హైదరాబాద్, మార్చి5(పీపుల్స్ మోటివేషన్) :**

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలో 200 యూనిట్లలోపు విద్యుత్ వాడుకునే వినియోగదారులకు ఎలాంటి బిల్లు వసూలు చేయవద్దనే ప్రభుత్వ పథకంలో జరుగుతున్న పొరపాటు వల్ల లక్షలాది మంది అర్హులకు అన్యాయం జరుగుతుంది అని ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. కేవలం 200 యూనిట్ల వరకు వినియోగించిన వారికి అధికారులు జీరో బిల్లు ఇస్తున్నారు.. కానీ, ఒక్క యూనిట్ ఎక్కువ వచ్చినా సరే మొత్తం 201 యూనిట్లకు బిల్లు వసూలు చేస్తున్నారు అని పేర్కొన్నారు. వినియోగదారులు ప్రతీ రోజు పొద్దున లేచి తాము ఎంత కరెంటు కాలుస్తున్నాము? మీటర్ ఎంత తిరుగుతుంది? అనేది చూసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని ఆయన మండిపడ్డారు. 200 యూనిట్లు దాటితే 200 యూనిట్ల వరకు అయ్యే భారాన్ని ప్రభుత్వమే భరించి.. మిగతా యూనిట్ల ధరను వినియోగదారుడు చెల్లించే విధంగా బిల్లింగ్ వ్యవస్థలో మార్పులు చేయాలని హరీశ్ రావు విన్నవించుకున్నారు.ఇక, తెలంగాణ రాష్ట్రంలో 90 లక్షల మంది తెల్లరేషన్ కార్డులుంటే.. ప్రభుత్వం కేవలం 30 లక్షల మందికి మాత్రమే ఈ పథకాన్ని అమలు చేస్తుందని హరీశ్ రావు అన్నారు. మిగతా 60 లక్షల మందికి తీవ్ర అన్యాయం జరుగుతుంది.. హైదరాబాద్ నగరంలో కూడా 30 లక్షల మంది పేదలుంటే, కేవలం 10 లక్షల మందికే పథకం అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.. కేవలం మూడో వంతు పేదలకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది.. రెండు వంతుల పేదలను విస్మరిస్తున్నారు.. ఇది సరైంది కాదు అని ఆయన పేర్కొన్నారు. ఇక ఒక రేషన్ కార్డు కింద ఒక కుటుంబాన్ని మాత్రమే పరిగణలోకి తీసుకుంటున్నారు.. ఒక రేషన్ కార్డులో పేర్లున్న వారు రెండు మూడు కుటుంబాలుగా కూడా విడిపోయి బతుకుతున్నారు అని హరీశ్ రావు వెల్లడించారు.ఒకే ఇంట్లో వేర్వేరు పోర్షన్లలో వేర్వేరు అంతస్తుల్లో ఉంటున్నారు.. కానీ, ప్రభుత్వం వారందరినీ ఒకే కుటుంబంగా లెక్క కట్టి ఒక్కరికే పథకం వర్తింప చేస్తుంది అని హరీశ్ రావు అన్నారు. ఇది కూడా సరైన పద్ధతి కాదు.. ఎన్ని కుటుంబాలుంటే అన్ని కుటుంబాలకు ఈ పథకాన్ని వర్తింప చేయాలి.. నిజమైన పేదలకు న్యాయం చేయడమే మీ ప్రభుత్వ లక్ష్యమైతే.. మొత్తం 90 లక్షల పేద కుటుంబాలకు లబ్ది కలిగేలా చేయాలి.. అలా చేయని పక్షంలో ఈ పథకం కేవలం నామమాత్రంగానే మిగిలిపోతుందన్నారు. హామీల అమలుకు ప్రభుత్వమే తూట్లు పొడిచినట్లు అవుతుందనే విషయాన్ని మీ దృష్టికి తెస్తున్నాము.. నిజంగా పేదలకు సాయం చేయాలనే చిత్తశుద్ధి మీకుంటే.. వెంటనేపై మూడు విషయాల్లో తక్షణం ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్ చేశారు...

తెలుగు దినపత్రిక

# పీపుల్స్ మోటివేషన్

People's Motivation

బుధవారం । మార్చి । 6 । 2024



# యువత భవిష్యత్తు





**నంద్యాల, మార్చి 05 (పీపుల్స్ మోటివేషన్) :**

స్థానిక శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాల కళాశాలను నందు మంగళవారం నాడు యువ భవిష్యత్ కార్యక్రమము జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిసోర్స్ పర్సన్ ఎంఆర్.యశ్వంత్ రెడ్డి, కళాశాల చైర్మన్ ప్రొఫెసర్ జి.రామకష్ణ రెడ్డి, కళాశాల డైరెక్టర్ జి.హేమంత్ రెడ్డి, ప్రగతి రెడ్డి, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాల చైర్మన్ ప్రొఫెసర్ జి.రామకృష్ణ రెడ్డి మాట్లాడుతూ...ఈ రోజు భవిష్యత్ మొత్తం రాబోయే వ్యవస్థాపకులు గా ఉండే వారిదే అని తెలియజేసారు. భవిష్యత్తులో పారిశ్రామికవేత్తలు సాంకేతిక పురోగతి ఫలితంగా సంభావ్య ఉద్యోగ స్థానభ్రంశం మరియు ఆటోమేషన్‌ను నావిగేట్ చేయాలి అని మారుతున్న ల్యాండ్‌స్కేప్‌లో సందర్భోచితంగా ఉండటానికి అనుకూలతను కలిగి ఉండటం. మరియు కొత్త నైపుణ్యాలను నిరంతరం నేర్చుకోవాలి అని చెప్పారు. ఆర్థిక శాస్త్రంలో, వ్యవస్థాపకుడు అనే పదం ఆవిష్కరణలు లేదా సాంకేతికతలను ఉత్పత్తులు మరియు సేవల్లోకి అనువదించే సామర్థ్యాన్ని కలిగి ఉన్న సంస్థ కోసం ఉపయోగించబడుతుంది. ఈ కోణంలో వ్యవస్థాపకత అనేది స్థాపించబడిన సంస్థలు మరియు కొత్త వ్యాపారాలు రెండింటి యొక్క కార్యకలాపాలను వివరిస్తు చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎం ఆర్ యశ్వంత్ రెడ్డి మాట్లాడుతూ.. వ్యవస్థాపకత అనేది ఆర్థిక విలువను సృష్టించడం లేదా వెలికితీస్తుంది అని, ఇది సాధారణంగా తక్కువ మొత్తంలో రిస్క్ సాంప్రదాయ వ్యాపారం ద్వారా ఊహించబడం కంటే ఎక్కువగా ఉంటుంది మరియు కేవలం ఆర్థిక విలువలతో పాటు సంభావ్య విలువలను కలిగి ఉండాలి అని తెలిపారు. వ్యవస్థాపకుడు అంటే ఒకటి లేదా అంతకంటే ఎక్కువ వ్యాపారాలను సృష్టించే మరియు పెట్టుబడి పెట్టి, చాలా నష్టాలను భరిస్తూ మరియు చాలా రివార్డ్‌లను ఆస్వాదించే వ్యక్తి అని వ్యాపారాన్ని స్థాపించే ప్రక్రియను "ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్" అంటారు. వ్యవస్థాపకుడు సాధారణంగా ఆవిష్కర్తగా కొత్త ఆలోచనలు, వస్తువులు, సేవలు మరియు వ్యాపారం/లేదా విధానాలకు మూలం. మరింత ఇరుకైన నిర్వచనాలు వ్యవస్థాపకత అనేది ఒక కొత్త వ్యాపారాన్ని రూపొందించడం, ప్రారంభించడం మరియు నిర్వహించడం వంటి ప్రక్రియగా వర్ణించబడ్డాయి. తరచుగా చిన్న వ్యాపారాన్ని పోలి ఉంటుంది లేదా వ్యాపార నిఘంటువు ప్రకారం ఏదైనా వ్యాపార వెంచర్‌ను అభివృద్ధి చేయడానికి, నిర్వహించడానికి మరియు నిర్వహించడానికి సామర్థ్యం మరియు సుముఖత. లాభం పొందడానికి దాని నష్టాలు కూడా రావచ్చు అని చెప్పారు .ఈ వ్యాపారాలను సృష్టించే వ్యక్తులను తరచుగా వ్యాపారవేత్తలు గా సూచిస్తారు. వ్యవస్థాపకత యొక్క నిర్వచనాలు సాధారణంగా వ్యాపారాల ప్రారంభం మరియు నిర్వహణపై దృష్టి సారిస్తుండగా, స్టార్టప్ కంపెనీని ప్రారంభించడంలో అధిక నష్టాలు ఉన్నందున, స్టార్టప్‌లలో గణనీయమైన భాగం లేమి కారణంగా మికాల్ బెలికోవ్ మాటలలోమూసివేయవలసి ఉంటుంది. నిధులు, చెడు వ్యాపార నిర్ణయాలు, ప్రభుత్వ విధానాలు, ఆర్థిక సంక్షోభం, మార్కెట్ డిమాండ్ లేకపోవడం లేదా వీటన్నింటి కలయిక వుండాలి అని చెప్పారు. కళాశాల డైరెక్టర్ జి.హేమంత్ రెడ్డి మాట్లాడుతూ...గత 25 సంవత్సరాలుగా విద్యా సేవలు అందిస్తున్న మన సంస్థ నుండి చాలా మంది విద్యార్థులు దేశ విదేశాలలో పారిశ్రామికంగా ఎదుగుతున్నారు అని వారిని స్ఫూర్తిని ప్రతి యొక్క విద్యార్థి అలవరుచుకోవాలి అని అంత స్థాయిలో ఉన్న మన విద్యార్థులకి కావాల్సిన సహకారాలు కళాశాల నుండి ప్రతి ఒక్క విద్యార్థికి అందుతాయని దాని కోసమే అటల్ ఇంక్యూబేషన్ సెంటర్ ను స్థాపించారు అని తెలిపారు. కళాశాల అధ్యాపకులు యం.ఇంతియాజ్ అహ్మద్ మాట్లడుతూ.. ప్రతి ఒక్క విద్యార్థి కూడా భవిష్యత్తులో ఒక మంచి వ్యాపార వేత్తగా మారాలంటే కష్టం తో పాటు దీక్షతో పూనిన ఏకాగ్రత ఉండాలి అని అందుకోసం సమకాలీన పరిస్థితుల్ని తయారు చేసుకోవాలి అని మన కళాశాలలో చదివే ప్రతి విద్యార్థి కూడా అంతగా ఎదగాలని తెలిపారు. విచ్చేసినటి వంటి ముఖ్య అతిథిని కళాశాల యాజమాన్యం అధ్యాపకులు సన్మానించడం జరిగింది. చివరిగా ఈ కార్యక్రమం జాతీయ గేయ ఆలపనతో ముగిసింది.

# నంద్యాలలో వేసవిలో నీటిఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు





**నంద్యాల, మార్చి 05 (పీపుల్స్ మోటివేషన్) :**

వేసవికాలన్ని దృష్టిలో ఉంచుకొని నంద్యాల ప్రజలు త్రాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఉండేందుకు మున్సిపల్ చైర్పర్సన్ మాబున్నీసా, వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంషావలి, కౌన్సిలర్లు, మున్సిపల్ ఇంజనీర్లతో కలిసి ముందస్తు చర్యలను చేపట్టారు. ఈ మేరకు బండిఆత్మకూరు మండలం సంతజూటూరు పికప్ ఆనకట్టను పరిశీలించి త్రాగునీటి అవసరాలకు సంబంధించిన నీటిని నంద్యాలకు తరలించేందుకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్, వైస్ చైర్మన్లు, ఇంజనీర్ మాట్లాడుతూ...నంద్యాల ప్రజలకు వేసవిలో త్రాగునీటి ఎద్దడి లేకుండా ఉండేందుకు ముందస్తు చర్యలను చేపట్టాలని ఎమ్మెల్యే శిల్పారవిరెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు బండిఆత్మకూరు మండలం సంతజూటూరు ఆనకట్టను పరిశీలించడం జరిగిందన్నారు. ఇరిగేషన్ అధికారులు కేసీకి 900 క్యూసెక్ల నీటిని దిగువకు విడుదల చేయడం జరిగిందని, అందులో సంతజూటూరు ప్రాంతంలోకి కుందూకు నీరు రావడంతో ఆ నీటిని నంద్యాల ప్రజల త్రాగునీటి అవసరాలకు తరలించే ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. వెలుగోడు రిజర్వాయర్లో నంద్యాల ప్రజల త్రాగునీటి అవసరాలకు నీటి నిల్వలను చేపట్టడం జరిగిందని, ఈ నీటిని నంద్యాలకు తరలించేందుకు ఎమ్మెల్యే ముందస్తుగా సంబంధిత అధికారులతో చర్చించి ప్రభుత్వ అనుమతులు తీసుకోవడం జరిగిందన్నారు. రానున్న కాలంలో నంద్యాల ప్రజలకు నీటి సమస్య లేకుండా వచ్చే ఆగస్ట్ నెల వరకు నీటి సమస్య తలెత్తదని తెలిపారు. నంద్యాల ప్రజలు త్రాగునీటి సమస్య ఉండదని ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరంలేదన్నారు.

# రాష్ట్ర అభివృద్ధి

## చంద్రబాబుతోనే - టిడిపి



**బేతంచెర్ల, మార్చి 05 (పీపుల్స్ మోటివేషన్):**

రాష్ట్రం అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమవుతుందనీ డోన్ టిడిపి అభ్యర్థి కోట్ల జయ సూర్యప్రకాష్ రెడ్డి తనయుడు కోట్ల రాఘవేంద్ర రెడ్డి అన్నారు. మంగళవారం బుగ్గనిపల్లె గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్-గ్యారెంటీ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రతి ఇంటికి ఏడాదికి మూడు సిలిండర్ లు, తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, రైతులకు ఏడాదికి పెట్టుబడి నిది క్రింద రూ.20 వేలు, బిసి రక్షణ చట్టం, మొదలగు పథకాలు గురించి ప్రజలకు వివరించారు.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఉన్నాం ఎల్లా నాగయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు పోలూరు వెంకటేశ్వర రెడ్డి, మాజీ జెడ్పిటిసి సభ్యురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి, బిమేశ్వర రెడ్డి, ఉమ్మడి జిల్లాల సర్పంచ్ ల సంఘము అధ్యక్షుడు శ్రీనువాసులు యాదవ్, ముస్లిం మైనారిటీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జాకీరుల్లా బేగ్, పోలూరు రాఘవ రెడ్డి రాష్ట్ర క్రిస్టియన్ సెల్ కమిటీ కార్యదర్శి మేకల నాగరాజు, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి రవీంద్ర నాయక్, రూబెన్, బుక్కపురం సర్పంచ్ నాగరాజు, జనసేన నాయకులు చల్లా మద్దిలేటిస్వామి, నాగరాజు కౌన్సిలర్ కానాల అంజి, మంచినీళ్ల సుమంత్, రామకృష్ణ, రవి, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా నూతన ధ్వజస్తంభ విగ్రహ ప్రతిష్ట వేడుకలు

- పూజలో పాల్గొన్న ఆలయ చైర్మన్, సర్పంచ్ తదితరులు



**నంద్యాల/ రుద్రవరం, మార్చి 05 (పీపుల్స్ మోటివేషన్):-**

మండల పరిధిలోని ఆలమూరు గ్రామంలో కొలువైన లక్ష్మీదేవి, చెన్నకేశవ ,లక్ష్మీ నరసింహ స్వామి ధ్వజ స్తంభ విగ్రహ ప్రతిష్ట వేడుకలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఆలయ కార్య నిర్వహణ అధికారి సాయి జయచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్ పాణ్యం నాగేష్, సర్పంచ్ పాణ్యం లక్ష్మీదేవి, దేవాలయ కమిటీ చైర్మన్ శూలం ప్రభాకర్ తదితరులు భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ విగ్రహ ప్రతిష్ట వేడుకల్లో పూజలు నిర్వహించారు. 5 ,6 ,7, తేదీలలో ధ్వజ విగ్రహ ప్రతిష్ట వేడుకలు జరుగుతున్నాయని ఇందులో భాగంగా మొదటి రోజున మహాగణపతి పూజ, పుణ్యాహ వాచనం, కలశ స్థాపన, యంత్ర స్థాపన, మహా మంగళహారతి, తీర్థ ప్రసాద కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు, ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

# రాష్ట్రాలను లూటీ చేస్తున్న కుటుంబ పార్టీలు

- కుటుంబ పాలనకు నేను పూర్తిగా వ్యతిరేకం
- దేశ ప్రజలే నా కుటుంబం అన్న ప్రధాని
- భారత్‌ను మూడో ఆర్థికశక్తిగా తీర్చిదిద్దుతా
- సంగారెడ్డి సభలో విపక్షాలను ఏకిపారేసిన మోడీ

**సంగారెడ్డి, మార్చి5(పీపుల్స్ మోటివేషన్) :**

తెలంగాణ ప్రజలు చూపిస్తున్న ప్రేమ, ఆదరణను వృథా కానివ్వనని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. మనమంతా కలిసి దేశాన్ని ప్రపంచంలోనే అత్యున్నత స్థాయికి తీసుకెళ్లాలన్నారు. ప్రపంచంలో తెలుగు వారి ఖ్యాతి వ్యాప్తిచెందిందని.. ఇది దేశానికి గర్వకారణమని చెప్పుకొచ్చారు. మంగళవారం సంగారెడ్డిలో ప్రధాని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం పటేల్‌గూడలో ఏర్పాటు చేసిన సభలో.. నా తెలంగాణ కుటుంబ సభ్యులందరికీ నమస్కారాలు అంటూ మోదీ తెలుగులో ప్రసంగం మొదలుపెట్టారు. తెలంగాణను రెండింతలు అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. ఇది మోదీ గ్యారెంటీ.. మోదీ గ్యారెంటీ అంటే గ్యారెంటీగా పూర్తయ్యే గ్యారెంటీ అని స్పష్టం చేశారు. కశ్మీర్‌లో 370 ఆర్టికల్ రద్దు చేస్తామని చెప్పామని. చేశామా? లేదా? అయోధ్య రాముడి ప్రాణ ప్రతిష్ట చేస్తామని చెప్పాం.. చేశామా.. లేదా.. మోదీ ఇచ్చిన గ్యారెంటీ.. నెరవేరిందా? లేదా? అని అన్నారు.ప్రపంచంలోనే అత్యంత వేగంగా ఆర్థిక శక్తిగా ఎదుగుతున్న దేశంగా భారత్ ఎదుగుతోందని అన్నారు. ఇప్పుడు మీకు మరో గ్యారెంటీ ఇస్తున్నా. కొన్నేండ్లలో ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా భారత్‌ను తీర్చిదిద్దుతా.. మీకు మాటిస్తున్నా. ఇది మోదీ గ్యారెంటీ.. మోదీ గ్యారెంటీ అంటే గ్యారెంటీగా పూర్తయ్యే గ్యారెంటీ. మోదీని తిట్టడమే కొందరు పనిగా పెట్టుకున్నారు. అలా ఎందుకు చేస్తున్నారంటే.. వారికి సంబంధించిన వేల కోట్ల అవినీతిని ప్రశ్నించినందుకు తిడుతున్నారు. నేను వ్యక్తిగతంగా ఎవరిపైనా విమర్శలు చేయలేదు.. కుటుంబ పాలనపై ప్రశ్నించినందుకు నన్ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారు. జమ్ము కశ్మీర్ నుంచి మొదలు తమిళనాడు వరకు కుటుంబ పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కుటుంబాలు మాత్రమే బాగుపడ్డాయి.. రాష్ట్రం మాత్రం అధోగతి పాలైంది. కుటుంబ పాలనను మేము వ్యతిరేకిస్తున్నాం. అందుకే మాపై వారు విమర్శలు చేస్తున్నారు. నేను కుటుంబ పాలనపై ప్రశ్నిస్తుంటే.. వారు మాత్రం నాకు కుటుంబం లేదని నాపై విమర్శలు చేస్తున్నారు. కుటుంబ పాలన చేసే వారికి దొంగతనం చేసేందుకు లైసెన్స్ ఇచ్చారా? కబ్జా, అవినీతి చేసేందుకు లైసెన్స్ ఇచ్చారా? ఒక్కో కుటుంబంలో 50 మంది వరకు దోచుకుతింటున్నారు.. ఇది ప్రజాస్వామ్యమా.. మోదీపై మా యుద్ధం కొనసాగిస్తామని చెబుతున్నారు. మోదీకి కుటుంబం లేకపోతే కుటుంబ పార్టీలన్నీ యుద్ధానికి దిగుతాయా? కుటుంబ పార్టీలన్నీ తమ కుటుంబమే ఫస్ట్ అనుకుంటాయి.. కానీ మోదీకి మాత్రం నేషన్ ఫస్ట్. వారికి వారి కుటుంబమే ముఖ్యం.. కానీ నాకు దేశ ప్రజలంతా ముఖ్యం. కుటుంబ పార్టీలు నల్ల ధనాన్ని తెల్ల ధనంగా మార్చుకున్నాయి. కానీ నేను అలా కాకుండా నాకు వచ్చిన గిఫ్టులను దేశ అభివృద్ధి కోసం వేలం వేస్తున్నా.. గంగా మాత సేవ కోసం ఉపయోగిస్తున్నా. నేను మీ సేవకుడిని. నాకు కూడా కుటుంబం ఉంటే.. నాకు వచ్చిన గిఫ్టులను, వేలం ద్వారా వచ్చిన డబ్బులను నేను పట్టుకెళ్లేవాడినేమో.. కుటుంబ పార్టీలకు చెందిన కొందరు నేతలు విదేశీ బ్యాంకుల్లో ఖాతాలు ఓపెన్ చేశారు. వారు తమ కుటుంబం కోసం కోటలు కట్టించుకున్నారు. కానీ మోదీ ఇప్పటి వరకు తన కోసం ఒక్క ఇల్లును కూడా కట్టించుకోలేదు. కానీ ఇండ్లు లేని పేదల కోసం 4 లక్షల కోట్ల ఇండ్లను నిర్మించాడు. కుటుంబ పార్టీలు భూమి నుంచి ఆకాశం వరకు దేన్నీ వదలకుండా దోచుకున్నారు. కానీ మోదీ మాత్రం భుమి, ఆకాశం మాత్రమే కాకుండా పాతాళం వరకు ప్రతీ ఒక్క అవకాశాన్ని దేశాభివృద్ధి కోసమే చేస్తున్నారు. 140 కోట్ల మంది దేశ ప్రజలు మోదీ కుటుంబ సభ్యులే.. కాంగ్రెస్, ఇండియా కూటమి వాళ్లకు ఇంకా తెలియడం లేదు.. మోడీని దేశమంతా తమ కుటుంబ సభ్యులుగా భావిస్తున్నారు. తెలంగాణ ప్రజలంతా నేనే మోదీ కుటుంబమని చెబుతున్నారని ప్రధాని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు కిషన్ రెడ్డి, లక్ష్మణ్, బిబి పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు దినపత్రిక

పీపుల్స్ మోటివేషన్

People's Motivation

# రోడ్డెక్కిన భూ నిర్వాసిత రైతులు

**న్యాయమైన పరిహారం కోసం డిమాండ్**

**ఏలూరు, మార్చి 05 (పీపుల్స్ మోటివేషన్):**

గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతులు రోడ్డెక్కారు. జంగారెడ్డిగూడెం మండలం పెరంపేట- పంగిడిగూడెం మధ్యలో గ్రీన్ ఫీల్డ్ హైవే అండర్ పాస్ వద్ద టెంటు వేసి పనులు అడ్డుకొని రైతులు ధర్నా నిర్వహించారు. గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల పోరాట కమిటీ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. న్యాయమైన పరిహారం ఇవ్వాలంటూ నినాదాలు చేశారు. పోలీసులు వచ్చి హైవే పనులు అడ్డుకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించినా రైతులు ఆందోళన కొనసాగించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతులు తమకు న్యాయమైన పరిహారం ఇవ్వాలంటూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. రైతులకు అతి తక్కువ పరిహారం ఇచ్చి బలవంతంగా భూములు లాక్కోవడం దారుణమని విమర్శించారు. ఆర్బిట్రేషన్ ద్వారా పరిహారం పెంచి ఇస్తామని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చి విచారణ పూర్తి అయినా ఆర్బిట్రేషన్ జడ్జిమెంట్స్ ఇవ్వకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఆర్బిట్రేషన్ జడ్జిమెంట్స్ ఇచ్చి రైతులకు న్యాయమైన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. హైవే పనులు వల్ల దుమ్ము ధూళితో పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. నిర్వాసిత రైతులకు జిల్లా కలెక్టర్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. బోర్లు కోల్పోయిన వారికి వెంటనే జలకళ పథకంలో బోర్లు వేయాలని కోరారు. సర్వీస్ రోడ్లు ప్రొవిజన్ కల్పించాలని సర్వీస్ రోడ్లు బీటీ రోడ్లుగా నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. భూమి ఒకవైపు బోర్ ఒక వైపు ఉన్న రైతులకు హైవే కింద నుండి ఎ÷-లాస్టిక్ పైపులు అమర్చాలని కోరారు. తగినంత ఎత్తులో అండర్ పాస్‌లు నిర్మాణం చేయాలన్నారు. రైతులకు న్యాయం చేయకపోతే పోరాటాన్ని ఉదతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసనకు టిడిపి చింతలపూడి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి సొంగా రోషన్ కుమార్,రావూరి కష్ణ పెనుమర్తి రామ్ కుమార్ రైతులు ఆందోళనకు మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు రాంబాబు, గ్రీన్ ఫీల్డ్ భూ నిర్వాసిత రైతుల పోరాట కమిటీ నాయకులు గోలి నర్సిరెడ్డి, వందనపు సాయిబాబా,పి.సోమిరెడ్డి,పి. సత్తిరెడ్డి, గూడపాటి శ్రీనివాసరావు, పరిమి రామారావు, ఆలపాటి మురళి, కొట్టు కనక నరసింహారావు, పుసులూరి శ్రీహరి, పల్లి వెంకటరామారావు, అందుగుల మోహన రావు,మాంద్రు సూర్యచంద్రం తదితరులు పాల్గొన్నారు.




# వేగంగా మారుతున్న రాష్ట్ర రాజకీయాలు

- సమీకరణాలతో తలామునకలైపోతున్న నేతలు
- రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలకు వేదిక" నంద్యాల"
- బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి నంద్యాల కు రాక..
- రాష్ట్ర బిజెపి నాయకులు నేడు నంద్యాలకు రాక..
- బిజెపి,తెలుగుదేశం పొత్తులపై టెన్షన్,టెన్షన్...
- నంద్యాలలో రేపు ఏమిజరగబోతుంది..
- టిడిపి, జనసేన, బిజెపి భవితవ్యం తేలనుందా
- రాష్ట్ర బిజెపి అభ్యర్థుల ప్రకటన నంద్యాలలో శ్రీకారం చుట్టనున్నారా

**నంద్యాల, మార్చి 05 (పీపుల్స్ మోటివేషన్):**

రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనల కు నంద్యాల వేదికగా మారనున్నట్టు తెలుస్తోంది.టిడిపి,వైసిపి అభ్యర్థులు కొన్ని ప్రాంతాల్లో ప్రకటించినా బిజెపి పొత్తు అంశం రెండు పార్టీల్లో టెన్షన్ వాతావరణం నెలకొంది. వారం రోజులుగా రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు పార్టీ అధిష్టానాల కు మింగుడుపడటం లేదు.పొత్తుల విషయంలో రెండు పార్టీల తో బిజెపి సమన్వయం లోపించడంతో బిజెపి అధిష్టానం పొత్తులు లేకుండా 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేయాలని భావిస్తోంది. బిజెపి పెద్దలు అన్ని నియోజకవర్గములోని బిజెపి పెద్దలు,నాయకులతో అన్ని జిల్లాల్లో సమావేశాలు, సలహాలు, సూచనలు తీసుకున్నారు.నంద్యాల జిల్లాలో బనగానపల్లె లో వైసిపి చేపట్టిన కార్యక్రమం అర్ధాంతరంగా రద్దైంది.అలాగే తెలుగుదేశం పార్టీ నంద్యాల,మైదుకూరు లో చేపట్టిన కార్యక్రమం కూడా అర్ధంతరంగా రద్దు కావడంతో రెండు పార్టీల్లో ఉన్న నాయకుల్లో,కార్యకర్తల్లో అంతర్మధనం మొదలైంది.మరోవైపు వైసిపి,జన సేన,తెలుగుదేశం అధిష్టానాలు ఢిల్లీ పెద్దలతో కలిసే బిజీలో మారిపోయారు. బిజెపి పెద్దలలో పొత్తు అంశం ఈ నెల 9 కానీ 11 న తేలనుందనీ తెలుస్తోంది.ఇప్పటికే రెండు పార్టీల్లో ప్రకటించిన అభ్యర్థుల్లో టెన్షన్ మొదలైంది.ఈ నేపథ్యంలోనే రాజకీయ ప్రకంపనల కు వేదిక నంద్యాల మారనుంది.ఉమ్మడి జిల్లాల్లో జరుగుతున్న పరిణామాలు చక్కదిద్దేందుకు బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు బుధవారం నంద్యాల కు చేరుకోనుంది.ప్రస్తుతం నంద్యాల బిజెపి అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మధు కార్యాలయం కు ఉమ్మడి జిల్లాలోని బిజెపి నాయకులు,కార్యకర్తలు సమావేశం నిర్వహిస్తున్నారు. బిజెపి తో పొత్తులు లేక పోతే రాష్ట్ర వ్యాప్తంగా బిజెపి అభ్యర్థుల భవితవ్యం నంద్యాల నుంచే శ్రీకారం చుట్టనున్నట్టు సమాచారం.నంద్యాలలో బిజెపి పార్టీ కి అభిరుచి మధు ఊపునివ్వడంతో కేంద్ర ప్రభుత్వ పెద్దల దృష్టిలో పడ్డారు. బిజెపి పార్టీ ఆదేశాల మేరకు ప్రజా పోరు యాత్ర,పల్లె నిద్ర,పట్టణ,గ్రామీణ ప్రాంతాల్లో బిజెపి చేపట్టిన పథకాలు వివరించడంలో సఫలీకృతులు అయ్యారు.నంద్యాలలో స్తబ్దత గా ఉన్న బిజెపి లో నాయకులు,కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు.అధిష్టానం ఇచ్చిన ఏ కార్యక్రమమైనా విజయవంతం చేస్తున్నారు.ప్రధాని మోడీ రాష్ట్రానికి చేసిన అభివృద్ధి పనులు ప్రజలకు వివరించారు.పొత్తులు,అభ్యర్థులు,పార్టీ అధిష్టానాలు నంద్యాలలో బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి రాక తో ఏమిజరగబోతోందని మేదావులు,రాజకీయ విశ్లేషకులు వేచి చూస్తున్నారు.

# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ముందుకు తీసుకుపోవాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, మార్చి5(పీపుల్స్ మోటివేషన్) :**

సికింద్రాబాద్ కంటోన్మెంట్ సిక్ విలేజ్ లో దోబిఘాట్ ప్రాంగణంలో చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి మంత్రి పొన్నం ప్రభాకర్ నివాళులు అర్పించారు. అనంతరం మడ్ ఫోర్డ్ దోబిఘాట్ ఫేజ్ -2లో మోడర్న్ మెకనైజ్డ్ లాండ్రీ యూనిట్ ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఈర్లపల్లి శంకర్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురశెట్టి, కంటోన్మెంట్ కాంగ్రెస్ ఇంఛార్జ్ వెన్నెల గద్దర్ తో పాటు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ముందుకు తీసుకుపోవాలన్నారు. మనలో మనకు ఐక్యత వచ్చి సంఘా జీవులుగా సంఘాన్ని ముందుకు తీసుకెళ్ళే ప్రయత్నం చేసినపుడే ప్రభుత్వాలు స్పందిస్తాయన్నారు. హుస్నాబాద్ ప్రజల ఆశీర్వాదం పార్టీలో 30 సంవత్సరాలుగా ఉండడంతో మంత్రిని చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నన్ను హైదరాబాద్ ఇంఛార్జ్ మంత్రిగా నియమించారు అని చెప్పుకొచ్చారు. కుల వృత్తులు మారుతున్నాయి.. అందుకే సాంకేతికతకు అనుగుణంగా మారాలన్నారు. బలహీన వర్గాల శాఖ తరపున 119 మంది ఎమ్మెల్యేలు, మండలి సభ్యులు, లోక్ సభ, రాజ్యసభ సభ్యుల నిధులతో ఒక్కొక్కరు ఒక్కో మండలంలో దోబిఘాట్ నిర్మించాలి అని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.ప్రకృతిలో వచ్చే కల్లునీ పెద్ద పెద్ద హోటల్ లో అమ్మేలా చూడాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. నాయి బ్రాహ్మణులకు మంగలి షాపులు, ఇతర కుల వృత్తులు మోడర్న్ గా మారాలి.. ప్రభుత్వ ఆదేశాలను క్షేత్ర స్థాయిలో మరింత ముందుకు తీసుకుపోవాలి అని పిలుపునిచ్చారు. నాయి బ్రాహ్మణులకు, రజకులకు 250 యూనిట్ల ఉచిత విద్యుత్ బిల్లు ప్రభుత్వం ఇస్తది ఎవరు కనెక్షన్లు కట్ చేయవద్దని ఆదేశాలు ఇచ్చాం.. ఖజానా ఖాళీ అయింది, ఆ గల్లా నిండలంటే టైం పడుతుంది అని తెలిపారు. 500 రూపాయలకే గ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం.. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అందిస్తున్నాం.. బలహీన వర్గాల ఉన్నతికి కుల గణన తీర్మానాన్ని శాసనసభలో ప్రవేశపెట్టామని పొన్నం ప్రభాకర్ తెలిపారు.

# ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి







- గ్రామాలలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సహకరించాలి
- జిల్లా కలెక్టర్ డా.జి.సృజన

**కర్నూలు, మార్చి 05 (పీపుల్స్ మోటివేషన్):-**

రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ డా.జి.సృజన ఓటర్ లకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం మంత్రాలయం మండలం మాధవరం గ్రామం, ఎమ్మిగనూరు మండల కేంద్రంలోని వెంకటాపురం కాలనీ, ఆలూరు మండలం పెద్దహోతూరు గ్రామలలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ తో పరిశీలించి ఓటర్లకు ఓటు హక్కు పై జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సమస్యాత్మకంగా గుర్తించిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించి అక్కడే ఉన్న ఓటర్లతో మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా వినియోగించుకోవాలని, గ్రామాలలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు..సార్వత్రిక ఎన్నికలు సజావుగా,ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకోవడం జరుగుతోన్దన్నారు. ఎన్నికలు మన భవిష్యత్తును నిర్ణయించడంతో పాటు మన రాబోయే తరాలకు మార్గాన్ని నిర్దేశించడానికి కూడా ఎంతగానో ఉపయోగపడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. అలాంటి ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవడం మన అందరి బాధ్యత అని అన్నారు. ఎన్నికల సమయంలో ఒక్కరితో ఒకరు గొడవలు పడి ఎన్నికలు సజావుగా నిర్వహించకపోవడానికి ఎవ్వరూ కారణం కాకూడదన్నారు. ఆ విధంగా చేయడం వల్ల సమాజానికి ఇబ్బంది పెట్టిన వారవుతారన్నారు. ఎవ్వరి ఓటు హక్కు భంగం కలగకుండా వ్యవస్థ పరంగా మావైపు నుండి, సమాజ పరంగా మీ పాత్ర కూడా ఉండాలన్నారు.. అలా కాకుండా పోలింగ్ కేంద్రాల వద్ద బలగాలు ఏర్పాటు చేసే పరిస్థితి కల్పించవద్దని కలెక్టర్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఓటర్లు వారికి నచ్చిన వారికి ఓటు వేసే హక్కు రాజ్యాంగం కల్పించిందని దానిని ఓటర్లు గుర్తించాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆదోని సబ్ కలెక్టర్ రిటర్నింగ్ ఆఫీసర్ శివ్ నారాయణ్ శర్మ, పత్తికొండ రిటర్నింగ్ ఆఫీసర్ ఆర్డీఓ రామలక్ష్మి, కోడుమూరు రిటర్నింగ్ ఆఫీసర్ కర్నూలు ఆర్డీఓ శేషిరెడ్డి, మంత్రాలయం రిటర్నింగ్ ఆఫీసర్ మురళీ, ఆలూరు రిటర్నింగ్ ఆఫీసర్ రాము, తదితరులు పాల్గొన్నారు.



## నూతన ఎసైనీ కలిసిన పాత్రికేయులు

**చెన్నారావుపేట, మార్చి 05 (పీపుల్స్ మోటివేషన్):-**

చెన్నారావుపేట మండలానికి ఇటీవల నూతన బాధ్యతలు స్వీకరించిన ఎస్సైని మర్యాద పూర్వకంగా కలిసిన పాత్రికేయులు శేఖర్, స్వామీ, అశోక్ కలిశారు.



తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation
బుధవారం । మార్చి । 6 । 2024
తెలంగాణ వార్తలు
07

# అనేక అనర్థాలకు కారణమవుతున్న మద్యపానం

**పేదరికాన్ని, అనారోగ్యాన్ని మరింత పెంచి మృత్యు వాతకు దారి తీసినా ! అదుపు చేయలేరా....?**

రోగ నిరోధక శక్తిని క్షీణింప చేస్తూ కాలేయము, క్లోమము, మెదడు, నాడీ వ్యవస్థ, జీర్ణకోశ వ్యవస్థలపై దుష్ప్రభావం చూపుతున్న మద్యపానం పై ప్రజల్లోనూ, పాలకుల్లోనూ ఇప్పటికీ సోయి రాకపోవడం, పరిణామాలను గుర్తించకపోవడం నిజంగా బాధ్యతలను **విస్మరించడమే కాదా .....!**

గుండెపోటు, క్యాన్సర్ వంటి ప్రమాదకరమైన రోగాలకు కారణమవుతున్న మద్యపానం వలన దానికి బానిసలు అయినవారు సమాజంలో అవమానించ బడుతున్నారు.క్షణిక మానసిక ఉల్లాసం, తృప్తి కోసం మద్యపానాన్ని అలవాటుగా చట్టబద్ధమైన హక్కుగా భావించే జనం ఇప్పటికీ ఎక్కువగా ఉండడం ఆందోళన కలిగించే విషయం. దీనివల్ల ఒనగూరుతున్న అనేక అనర్థాలు శారీరక మానసిక ఆరోగ్యాలను దెబ్బతీయడమే కాకుండా, ప్రజా జీవితానికి సంబంధించిన ఇతర వ్యవస్థలకు కూడా సవాలుగా నిలుస్తున్న వేళ. రోడ్డు ప్రమాదాలు, అత్యాచారాలు, హత్యలు, ఆత్మహత్యలు, గృహహింస, కుటుంబాలు చిన్నాభిన్నం కావడంతో పాటూ యజమాని దాని కాటుకు బలి కావడంతో అనేక కుటుంబాలు వీధిన పడ్డ దౌర్భాగ్య పరిస్థితులను కూడా మనం చూడవచ్చు.అయినప్పటికీ ప్రజలలో మార్పు రాలేదు ! ప్రజలు సామాజికంగా జీవించే హక్కును బంగపరుస్తున్న మద్యపానం పట్ల ప్రభుత్వాలు కూడా బాధ్యతగా వ్యవహరించక బరితెగించి ఆదాయం కోసం పనిచేస్తున్న కారణంగా ఈ పరిణామాలు మరింతగా చోటు చేసుకుంటున్నాయి. ప్రపంచవ్యాప్తంగా మద్యానికి బానిసైన ప్రజా జీవితాన్ని పరిశీలించినప్పుడు 15 నుండి 19 ఏళ్ల మధ్య 27 శాతం యువత మద్యం కోరల్లో చిక్కి శల్యం అయిపోతున్నట్లు అవగతం అవుతున్నది. ప్రపంచ మద్యం మార్కెట్లో భారతదేశం మూడో స్థానాన్ని నిలబెట్టుకుంటే! 2019 కేంద్ర ప్రభుత్వ సర్వే ప్రకారం 10 నుండి 70 ఏళ్ల మధ్య వయసులో ప్రతి ఏడుగురులో ఒకరు మద్యాన్ని సేవిస్తున్నట్టుగా తెలుస్తున్నది. ఇక మందు తాగే అలవాటున్న ప్రతి 5గురు పురుషుల్లో ఒకరు పూర్తిగా మత్తుకు బానిసగా మారిపోయినట్లు వింటుంటే ఆందోళనకరమే కదా ...! ఇక మద్యానికి బానిస కావడానికి గల కారణాలను పరిశీలించి నప్పుడు కొంత ఆర్థికంగా బలపడడం, జీవనశైలిలో చోటు చేసుకుంటున్న మార్పులు, అనుకరణ, నాగరికత సంస్కృతి ముసుగులో కొట్టుమిట్టాడు తున్న వింత పోకడలు, సామాజిక మాధ్యమాలు, వ్యాపార ప్రకటనలు కూడా మరింతగా మద్యపానం వైపు ప్రజలను బానిసలుగా చేయడానికి కారణం అవుతున్నాయి. గతంలో మద్యపానానికి అలవాటు పడే సగటు వయసు 19 ఏళ్లు ఉంటే, ప్రస్తుతం 13 ఏళ్ల వయస్సు వాడే మద్యానికి అలవాటు పడి చిన్న వయస్సులోనే వృద్ధప్యాన్ని చూసినప్పుడు పాలకుల యొక్క బాధ్యతా రాహిత్యం మనకు అర్థం అవుతున్నది. బహుళ జాతి సంస్థల వ్యాపార ప్రకటనలు, సినిమా హీరోలు ఇతర క్రీడాకారులతోని ప్రకటనలు, మరింతగా రెచ్చగొడుతున్న విషయాన్ని కాదనలేము. అదే ! సందర్భంలో గ్రామీణ పేదరికం కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా కూడా మద్యానికి అలవాటు పడినవారు ఆర్థిక పరిస్థితి సహకరించని సందర్భంలో నకిలీ, కల్తీ మద్యాలకు అలవాటు పడి ప్రాణాలు కోల్పోతున్న వారిని కూడా మనం ఎక్కువగా చూడవచ్చు. అనేక రాష్ట్ర ప్రభుత్వాలు కూడా మద్యం వ్యాపారాన్ని ఆదాయ వనరుగా భావించే వాణిజ్య ధోరణి కారణంగా కూడా దీని నిషేధానికి అనేక అవాంతరాలు ఉన్నట్లు తెలుస్తున్నది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి రాష్ట్ర ఆదాయం 10,000 కోట్లు కాగా పదేళ్ల తర్వాత ప్రస్తుతము 45 వేల కోట్లకు చేరినట్లు ప్రభుత్వ గణాంకాలే తెలియజేస్తుంటే, ఆదాయం పెరగవచ్చు కానీ ! ఆ ముసుగులో చిక్కిపోయిన జీవితాలు, వీధిపాలైన కుటుంబాలు, అనారోగ్యం పేరున చేసిన ఖర్చు ఇప్పటికైనా ప్రజలను ఆలోచింప చేయకపోతే ఎలా ? బుద్ధి జీవులు, మేధావులు, సామాజిక రంగ నిపుణులు, బాధ్యతగల వారు మద్యపానం యొక్క ప్రభావాన్ని విస్తృతంగా అవగాహన చేయవలసిన అవసరం ఎంతగానో ఉన్నది. 1960 ప్రాంతంలో గుజరాత్ రాష్ట్రంలో తొలిసారిగా మధ్య నిషేధాన్ని ప్రారంభించినప్పటికీ ఆ తర్వాత మూడు నాలుగు రాష్ట్రాలు మినహాయిస్తే, దేశంలో అంతటా కూడా మద్యం ఏరులై పారుతున్నా , గత కాంగ్రెస్ ప్రభుత్వాలు కానీ, కొనసాగుతున్న బిజెపి ప్రభుత్వం కానీ ఏనాడు కూడా మధ్య నిషేధం ఆలోచన, మద్యం యొక్క పరిణామాలు, సామాజిక బాధ్యతను గుర్తించని కారణంగా కుటుంబాలు రోజురోజుకు పేదరికంలోకి నెట్టివేయబడుతూ వీధిపాలవుతున్నా, పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని ఖండించాల్సిన అవసరం బాధ్యతగల సమాజం పైన ఎంతగానో ఉన్నది. ప్రధాని రాష్ట్రమైన గుజరాత్ లో తొలిసారిగా నిషేధం విధించినప్పటికీ దానిని ఆదర్శంగా చూపి దేశవ్యాప్తంగా నిషేధానికి కృషి జరిగినట్లయితే ! అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశం ఏర్పరచి సమాలోచన చేయవలసిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానికి, ప్రధానికి లేదా ....? కొన్ని రాష్ట్రాలలో నిషేధించి మరికొన్ని రాష్ట్రాల్లో కొనసాగుతున్న కారణంగా అక్రమ రవాణా వల్ల చోటు చేసుకుంటున్న పరిణామాలను ప్రేక్షకులుగా చూడవలసి వస్తుంది. మద్యం విక్రయములో భాగంగా రోజురోజుకు అధికంగా దుకాణాలను పెంచడంతో పాటూ బెల్టు షాపులను అపరిమితంగా అనుమతించడంతో వివిధ పనులలో నిమగ్నమయ్యే వారు, పలు వృత్తులను కూడా విస్మరించి తాగుడుకు బానిసలై ఉత్పత్తికి కూడా ద్రోహం చేస్తున్నారు. తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఈ పరిణామాలను అంతో ఇంతో ఆలోచించినటువంటి ప్రపంచ ఆరోగ్య సంస్థ 2010లో ప్రపంచ దేశాలకు సూచన చేస్తూ మద్యపాన మహమ్మారిని నియంత్రించాలని ప్రతి వ్యక్తికి ఆరోగ్య సామాజిక భద్రత కలిగించే లక్ష్యంతో ఆయా దేశాలు పనిచేయాలని దిశా నిర్దేశం చేసినట్టు తెలుస్తుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపు ఇచ్చినంత మాత్రాన ఆయా దేశాల పాలకులకు పట్టింపు ఉంటే కదా అమలు జరిగేది . 13 సంవత్సరాల తర్వాత 2023 మే నెలలో నిర్వహించిన సదస్సులో గత 13 ఏళ్ల అనుభవాన్ని సమీక్షించిన తర్వాత అనివార్యమైన పరిస్థితిలో రాబోయే ఏడేళ్లను కలుపుకొని 2030 నాటికి కట్టడి చేయాలని కార్యాచరణ ప్రకటించినట్లుగా తెలుస్తున్నది ! సమాజానికి జరుగుతున్న నష్టం, వివిధ సంస్థలపై ప్రభావం, అనారోగ్య పరిస్థితులు, కుటుంబ ఆర్థిక సమస్యల కారణంగా దేశాల యొక్క ఆర్థిక సంక్షోభాలను దృష్టిలో ఉంచుకొని మద్యం అమ్మకాలను క్రమబద్ధీక రించాలని, క్రమంగా నిషేధం వైపు కొనసాగాలని కట్టుదిట్టంగా తీర్మానం చేసినట్టు తెలుస్తుంది! అయితే ! ఇటు తాగేవారికి, అటు పాలకులకు ఉమ్మడిగా ఉండాల్సిన బాధ్యత ఇది. చిన్న వయస్సులో దాని బారిన పడ్డ కుటుంబాలు అనేకం. పరిమితం చేయడం ద్వారా ! చిన్న వయస్కులకు అమ్మకాలను నియంత్రించి క్రమబద్ధీకరించడం ద్వారా చట్టాలను కఠినంగా అమలుపరిచి మద్యం అందుబాటును తగ్గించాలి. అంతేకాదు క్లబ్బులు, పబ్బులు, ధాబాలు పేరుతో ఎల్లవేళలా అందుబాటులో ఉండే అవకాశాలను రద్దుచేసి, కేవలం దుకాణాలకు మాత్రమే పరిమితం చేయడం ద్వారా ప్రజల్లో మద్యపానం పట్ల క్రమంగా వ్యతిరేక భావాన్ని తీసుకురావడానికి అవకాశం ఉంటుంది.

ఇక మద్యపానం ద్వారా వచ్చే ఆదాయంతో ప్రభుత్వాన్ని నడపడానికి సిద్ధపడే పాలకులు తమ బాధ్యతను గుర్తించి ప్రత్యామ్నాయ విధానాల ద్వారా ఆదాయ మార్గాలను సంపద సృష్టించే వైపు దృష్టి సారించాలి. మద్యం ప్రకటనలో వివిధ రంగాల వారికి అవకాశం లేకుండా నిషేధించి, దానివల్ల వనగూరే పరిణామాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకు వెళ్లడం ద్వారా కౌన్సిలింగ్ కేంద్రాలను ఎక్కువగా ఏర్పాటు చేసి, దానికి బదులుగా ప్రత్యామ్నాయ పోషకాహార కేంద్రాలు, ఆహార పదార్థాలను ఎక్కువగా ప్రజలకు అందుబాటులో ఉంచే ప్రయత్నం చేయడం ద్వారా ప్రజల రోగనిరోధక శక్తిని పెంచడంతోపాటూ ఆరోగ్య భారతాన్ని నిర్మించడానికి అవకాశం ఉంటుంది. పేదరికం, నిరుద్యోగము, ఆకలి చావులు, ఆత్మహత్యలు, దోపిడీలు, పీడన, వంచన, అత్యాచారాలు, లైంగిక వేధింపుల వంటి సకల సమస్యలను పరిష్కరించాలంటే !? సమాజంలో మద్యపాన పరిణామాలను విపత్తులను లోతుగా ప్రజల్లోకి తీసుకెళ్లి ఆత్మ పరిశీలన చేసుకునే విధంగా ప్రజలను చైతన్యం చేయాల్సిన అవసరం ఉంది. వివిధ కళారూపాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, టీవీ ప్రసారాలు సినిమాలలో మద్యాన్ని విక్రయిస్తున్నట్లు, తాగుతున్నట్లు చూపే సన్నివేశాలను వెంటనే నిషేధించి పలు మీడియాల ద్వారా అనర్థాలను ఎక్కువగా ఫోకస్ చేసినట్లయితే ! ఈ అనర్థాల నుండి కొంతవరకు రక్షించుకునే అవకాశం ఉంది. "తను తెగనిదే కత్తి తెగదు" అన్నట్లు పాలకులు సామాజిక బాధ్యతగా ఆరోగ్య భారతాన్ని, సంపన్న దేశాన్ని, ప్రజలను బుద్ధి జీవులు జ్ఞానవంతులుగా తీర్చిదిద్దాలనే సంకల్పం ఉన్నప్పుడు మాత్రమే మద్యపానాన్ని పూర్తిగా కట్టుదిట్టం చేయడానికి, క్రమంగా నిషేదానికి అస్కారం ఉంటుంది...!!

బీరవేల్లి అవినాష్
ఎంఏ, ఏంసిజె (జర్నలిజం) జర్నలిస్ట్,

## సీఎం పర్యటన సభ స్థలం పరిశీలించిన ఎమ్మెల్యే పాయం



**పినపాక, మార్చి 05(పీపుల్స్ మోటివేషన్):-**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గం ఈ నెల 11-03-2024 న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని దర్శించుకోవడానికి విచేయుచున్న సందర్భంగా పినపాక నియోజకవర్గంలోని బూర్గంపాడు మండలం లక్ష్మీపురం వద్ద భారీ సభ మరియు ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రారంభించు సందర్భంగా స్థలం ప్రాంగణం మరియు పార్కింగ్ ప్లేస్ ను పర్యవేక్షించిన పినపాక నియోజకవర్గం శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గం ప్రజా సమస్యల కోసం కలెక్టర్‌తో భేటీ ఐనా ఎమ్మెల్యే పాయం



**కొత్తగూడెం, మార్చి 05 (పీపుల్స్ మోటివేషన్):**

ఈరోజు అనగా మంగళవారం రోజున భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ ఆఫీసులో పినపాక నియోజకవర్గం సమస్యల పరిష్కరించడానికి జిల్లా కలెక్టర్ ప్రియాంక అల తో పినపాక నియోజకవర్గం రోడ్లు మరియు పలు సమస్యల గురించి భేటీ ఐనా పినపాక నియోజకవర్గం శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు నియోజకవర్గం అభివృద్ధి లో నిర్లక్ష్యం వహించకుండా అన్నింటి లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ముందు ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా వాహనాల తనిఖీ, ఎస్సై హరిప్రసాద్ రెడ్డి

- ప్రతి వాహనదారుడు బాధ్యతతో డ్రైవింగ్ చేయాలి




**పెబ్బేరు, మార్చి 05 (పీపుల్స్ మోటివేషన్):-**

వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణ దగ్గర్లో బెంగళూరు హైదరాబాద్ బైపాస్, వెహికిల్స్ తనిఖీ చేసిన ఎస్ఐ హరి ప్రసాద్ రెడ్డి. మంగళవారం ఉదయం 9:30-10:00 గంటల మధ్య సమయంలో పోలీసులతో కలిసి హెల్మెంట్, డ్రైవింగ్ లైసెన్స్ లేని వాళ్ళు చెక్ చేయడం జరిగింది. ఎస్సై మాట్లాడుతూ...(స్పెషల్ డ్రైవ్) లో భాగంగా ఈ చలాన్ లను విధించడం పెండింగ్లో ఉన్న (ఈ చలాన్) లో రెండు బైకులను సీజ్ చేయడం జరిగింది. అదేవిధంగా త్రిబుల్ డ్రైవింగ్, వేగంగా మద్యం, సేవించి, నడపరాదు, వాహనదారులు అన్ని ఎవిడెన్స్, ఉంచుకొని జాగ్రత్తగా వాహనాలు నడపవలెనని తెలిపారు.

# మాలపల్లి గ్రామంలో 11 అడుగుల 12 కేజీల కొండచిలాలను పట్టుకున్న హెూంగార్డు కృష్ణసాగర్

- రూమ్‌లో కొండచిలువను గుర్తించిన గొర్ల కాపరి
- శ్రీశైలం నల్లమల అడవిలో వదిలేస్తాం అన్న హెూంగార్డు

**పెబ్బేరు, మార్చి 05 (పీపుల్స్ మోటివేషన్):-**

పెబ్బేరు మండలం మాలపల్లి గ్రామంలో బుధవారం,కృపాకర్ రెడ్డి వ్యవసాయ పొలంలో గొర్లను మేపుకుంటూ అలసిపోయి, కృపాకర్ రెడ్డి పొలంలో కొట్టం పక్కన ఉన్న గది దగ్గరకి వెళ్లి కూర్చొని నీళ్లు తాగుతుండగా పెద్ద శబ్దం రావడంతో అనుమానం వచ్చి గది తలుపులు తెరిచి చూడగా గదిలో ఉన్న ఫ్రిడ్జ్ కింద పడుకొని ఉన్న పెద్ద కొండచిలువ పామును చూసిన గొర్ల కాపరి మధు భయానికి గురైన మధు ఐదు నిమిషాల తర్వాత తేరుకొని వనపర్తి పట్టణ హెూమ్ గార్డ్ గా డ్యూటీ చేస్తున్న కృష్ణ సాగర్, ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వగా వెంటనే పెబ్బేరు మండలం మాలపల్లి గ్రామానికి చేరుకొని గేదెల కోట్టములో ఒక గదిలో ఫ్రిడ్జ్ కింద పడుకొని ఉన్న 11 అడుగులు ,12 కేజీల ఉన్న కొండచిలువ చూసి చాకచక్యంగా సహెూహితంగా బంధించిన కొండచిలువను శ్రీశైలం నల్లమల్ల అడవి ప్రాంతంలో వదిలి వేస్తానని కృష్ణసాగర్ తెలిపారు . సంఘటన స్థలంలో ఉన్న రైతు కృపాకర్ రెడ్డి ,గొర్రెల కాపరి మధు గ్రామ ప్రజలు కృష్ణ సాగర్ చేస్తున్నటువంటి సేవలు గుర్తుకు తెచ్చుకొని అభినందించారు



# సురక్షిత ప్రాంతాలకు వెళ్లండి"..

**ఇజ్రాయిల్‌లో ఉంటున్న భారతీయులకు కేంద్రం సూచన**

**న్యూఢిల్లీ, మార్చి5(పీపుల్స్ మోటివేషన్) :**

ఇజ్రాయిల్-హమాస్ పోరు నేపథ్యంలో భారత ప్రభుత్వం ఇజ్రాయిల్‌లో ఉంటున్న భారతీయులకు మంగళవారం కీలక సూచనలను జారీ చేసింది. క్షిపణి దాడిలో భారతీయులు మరణించిన తర్వాత, ఈ ఆదేశాలు జారీ చేసింది. " ప్రస్తుతం భద్రతా పరిస్థితులు, స్థానిక భద్రతా సలహాల దృష్ట్యా దక్షిణ సరిహద్దు ప్రాంతాల్లో పనిచేసే, సందర్శించే వారు ఇజ్రాయిల్ లోని సురక్షిత ప్రాంతాలకు మకాం మార్చాలని సూచించారు. రాయబార కార్యాలయం వారితో టచ్‌లో ఉంది. ఇజ్రాయిల్ అధికారులు మా పౌరులందరికీ భద్రత కల్పించాలి" అని భారత రాయబార కార్యాలయం ఎక్స్ ద్వారా పేర్కొంది. పోస్టులో ఎంబసీ సాయం కోసం హెల్ప్ లైన్ నెంబర్లు, ఈమెయిల్ అడ్రస్ షేర్ చేసింది. ఎంబసీ తన పోస్ట్‌లో ఇజ్రాయెల్ జనాభా మరియు ఇమ్మిగ్రేషన్ అథారిటీ యొక్క హాట్‌లైన్ నంబర్‌ను కూడా షేర్ చేసింది. క్షిపణి దాడిలో భారతీయులు మరణించిన తర్వాత ఇండియా ఈ సూచనలను జారీ చేసింది. లెబనాన్ నుంచి ప్రయోగించిన యాంటీ ట్యాంక్ మిస్సైల్ ఇజ్రాయిల్ ఉత్తర సరిహద్దు ప్రాంతాన్ని తాకింది. ఈ ఘటనలో ఒకరు మరణించగా.. ఇద్దరు గాయపడ్డారు. ముగ్గురు కూడా కేరళ రాష్ట్రానికి చెందిన వారు. చనిపోయిన వ్యక్తిని కేరళలోని కొల్లం జిల్లాకు చెందిన 31 ఏళ్ల పాట్ నిబిన్ మాక్స్‌వెల్‌గా గుర్తించారు. మాక్స్‌వెల్ రెండు నెలల క్రితమే ఇజ్రాయెల్‌కు వచ్చి, అక్కడి వ్యవసాయ క్షేత్రంలో పనిచేస్తున్నట్లు సమాచారం. గాయపడిన ఇద్దరు భారతీయులను బుష్ జోసెఫ్ జార్జ్ మరియు పాల్ మెల్విన్‌లుగా గుర్తించారు. పాలస్తీనా ఉగ్రవాద సంస్థ హమాస్ గతేడాది అక్టోబర్ 7న ఇజ్రాయిల్‌పై దాడి చేసి, 1200 మందిని చంపడంతో పాటు 240 మందిని బందీలుగా పట్టుకుని గాజాలోకి తీసుకెళ్లింది. అప్పటి నుంచి ఇజ్రాయిల్ గాజాస్ట్రిప్, వెస్ట్ బ్యాంకులపై దాడులు నిర్వహిస్తోంది. మరోవైపు లెబనాన్ లోని హిజ్బుల్లా గ్రూప్ హమాస్‌కి మద్దతుగా ఇజ్రాయిల్ ఉత్తర ప్రాంతంపై దాడులు చేస్తోంది. ఇప్పటి వరకు గాజా యుద్ధంలో 30,000 మందికి పైగా మరణించినట్లు గాజాలోని ఆరోగ్య అధికారులు తెలిపారు.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation



# అందాల ఆరబోతలో పోటీపడుతున్న రాశీఖన్నా

టాలీవుడ్ సుందరి రాశీ ఖన్నా అందాల ప్రదర్శనలో ఏమాత్రం తగ్గడం లేదు. రోజురోజు అంతకుమించి అనేలా దూసుకెళుతుందే తప్పితే ఎక్కడా వెనకడుగు వేయడం లేదు. ప్రస్తుతం టాలీవుడ్‌ను సైడ్‌కు పెట్టి పూర్తిగా బాలీవుడ్ పైనే దృష్టి పెట్టిన ఈ ముద్దుగుమ్మ అక్కడ పోటీలో నిలబడేందుకు, అవకాశాలు పట్టేయడానికి గ్లామర్ డోస్ పెంచుతూ పోతూ ఇక్కడ కుర్రాళ్ల గుండెల్లో మంటలు పెడుతోంది.వారం రోజుల క్రితం అసలు బట్టలు ఉన్నాయా లేవా అనే విధంగా బట్టలు వేసుకుని ఫొటోషూట్లు చేసిన ఈ చిన్నది.. మళ్లీ ఇప్పుడు అదే స్థాయిలో అందాల ప్రదర్శన చేసి అభిమానులకు కనులవిందు చేసింది.తాజాగా రెడ్ అవుట్ ఫిట్‌లో డ్రెస్‌ను జార విడిచి మరి అందాలను చూపిస్తూ మెస్మరైజ్ చేసింది. దీంతో అభిమానులు సినిమాలు లేకున్నా ఫర్లేదు మూడు రోజులకోసారి ఈ మాత్రం దర్శనం ఇస్తే చాలు అనేంత వరకు ఫ్యాన్స్ వెళ్లి పోయారు. ప్రస్తుతం బాలీవుడ్‌లో సిద్దార్థ్ మల్హోత్రా తో కలిసి యోధ అనే వార్ ఓరియంటెడ్ సినిమాలో నటించగా అది త్వరలో విడుదలకు రెడీ అయింది. ఇక తెలుగులో డీజే టిల్లు స్టార్ జోన్నలగడ్డ సిద్దుతో కలిసి చేస్తున్న తెలుసుకదా అనే చిత్రం తప్పితే మరో చిత్రానికి సంతకం చేయలేదు.ఇక హిందీలో ఫర్జీ అనే వెబ్ సిరీస్ పార్ట్2 లో నటించనుంది.

# ప్రభాస్‌తో మళ్లీ సినిమా చేయాలని ఉంది

## భీమా చిత్ర విశేషాలను పంచుకున్న గోపీచంద్




విజయం కోసం పరితపిస్తున్న నటుల్లో గోపీచంద్ ఇప్పుడు 'భీమా' అనే సినిమాతో మార్చి 8న ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. మహా శివరాత్రి సందర్భంగా ఈ సినిమా విడుదలవుతోంది, ఈ సినిమా నేపథ్యం పరశు రామ క్షేత్రం అని చెప్పారు. డిసెంబర్‌లో విడుదల చెయ్యాలని అనుకున్నా..అప్పట్లో 'సలార్' లాంటి పెద్ద సినిమా రావటం వల్ల వాయిదా వేసుకున్నారు. జనవరిలో కూడా పండగ సినిమాలు చాలా వున్నాయి, ఇక ఆలా వాయిదా పడుతూ ఇప్పుడు మార్చి 8, మహా శివరాత్రికి విడుదల కానుంది. 'భీమా' సినిమా గురించి గోపీచంద్ మాట్లాడుతూ 'ఈ సినిమా అన్ని భావోద్వేగాలు కలగలిపిన ఒక వాణిజ్యపరమైన సినిమా. తప్పకుండా ఆడుతుంది అనే నమ్మకం మాత్రం వుందని చెప్పారు. దర్శకుడు హర్ష ఈ కథ నాకు చెప్పేటప్పుడు, భీమా పాత్రకి నేను బాగా కనెక్ట్ అయ్యాను. ఇంతకు ముందు పోలీసాఫీసర్ పాత్రలు చేసినా అందులో కథ అంతా ఆ పోలీసు పాత్ర చుట్టూ తిరుగుతాయి, కానీ ఇందులో అలా కాదు, వేరేలా ఉంటుంది, ఒక చిన్న సెమి ఫాంటసీ కూడా ఉంటుంది, ఆ పాయింట్ కొత్తగా ఉండటమే కాకుండా నాకు బాగా నచ్చి ఈ సినిమా చేసాను అని గోపీచంద్ చెప్పారు.'భీమా'లో కూడా రెండు పాత్రలు ఒకటి పోలీసాఫిసర్, రెండోది ఒక శక్తివంతమైన పాత్ర వున్నాయి. 'అఖండ' సినిమాతో ఈ 'భీమా' పోల్చడం నాకైతే మంచిదే అనిపిస్తుంది. ఈ సినిమాలో పోరాట సన్నివేశాలు వున్నాయి, అలాగే వినోదాత్మక సన్నివేశాలు కూడా చాలా వున్నాయి. దీనికితోడు మంచి భావోద్వేగాలు వున్నాయి. పోరాట సన్నివేశాలలో హీరో వెళ్లి పది ఇరవై మందిని కొడితే ప్రేక్షకుడు చాలా బోర్ ఫీల్ అవుతాడు, ఒక సెన్స్ లేకుండా పోతుంది, అదే అందులో ఒక భావోద్వేగం వుండి, ఆ పోరాట సన్నివేశం చేస్తే, చేసేవాళ్ళకి, చూసే వాళ్ళకి కూడా హత్తుకుంటుంది. ఈ సినిమాలో అన్ని అలా కుదిరాయని చెప్పారు. 'లౌక్యం' లాంటి సినిమాలు' అని చెప్పారు. 'లౌక్యం' విజయం సాధించింది. 'భీమా'లో అన్ని ఎలెమెంట్స్ వున్న సినిమా, బాగుంటుంది అనే అనుకుంటున్నా. ప్రతి సినిమా విజయం సాధించాలని ప్రతి నటుడు కష్టపడి చేస్తారు. 'భీమా' సినిమా దర్శకుడు హర్ష ఈ సినిమా లో కథనం, ట్విస్ట్ లు అన్నీ బాగా చూపించగలిగాడు. పాన్ ఇండియా సినిమా కోసం కథ రాసుకుంటే నడవదు, ఎందుకంటే హిందీ ప్రేక్షకులకి, మన ప్రేక్షకులకి చాలా విషయాల్లో వ్యత్యాసం వుంది. ఇప్పుడు ఒక్క ప్రభాస్ కి తప్పితే ఏ నటుడూ కూడా పాన్ ఇండియా సినిమాలు చెయ్యడం లేదు, ఆ నటులకి కథలు రాయటం లేదు. ఎప్పటికైనా ప్రభాస్ తో మళ్ళీ కలిసి సినిమా చెయ్యాలని వుంది అని చెప్పారు గోపీచంద్. అతనొక్కడితోటే కాదు, మిగతా నటులతో కూడా కథ నచ్చితే సినిమా చేస్తాను అని చెప్పారు. తన రాబోయే సినిమాల గురించి మాట్లాడుతూ దర్శకుడు శ్రీను వైట్ల తో సినిమా 30 శాతం పూర్తయిందని, నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్ తో ఒక సినిమా ఉందని, అలాగే దర్శకుడు రాధాకృష్ణతో కూడా కథా చర్చలు జరుగుతున్నాయని, ఆ సినిమా యూవీ క్రియేషన్స్ నిర్మిస్తుందని చెప్పారు.



# అల్లు అర్జున్ నటనంటే ఎంతో ఇష్టం

టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌పై ప్రశంసల వర్షం కురిపించింది అగ్ర కథానాయిక సమంత. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ వీడియోలు వైరల్‌గా మారాయి. ఇటీవల ఓ కాలేజీ ఫెస్ట్‌లో పాల్గొన్న సమంతను కొందరు స్టూడెంట్స్ 'నటనలో మీకు స్ఫూర్తి ఎవరు?' అని అడిగారు. 'యాక్టింగ్‌లో నాకు అల్లు అర్జున్ స్ఫూర్తి అని సమాధానమిచ్చింది. తనతో కలిసి మరోసారి సినిమా చేయాలనుకుంటున్నా. ఎందుకంటే యాక్టింగ్ బీస్ట్‌గా ట్రాన్స్‌ఫార్మ్ అయ్యారు బన్నీ' అని ఆమె అన్నారు. ప్రస్తుతం ఈ వీడియోలను బన్నీ ఫాన్స్ సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. గతంలోనూ ఓ సందర్భంలో సమంత ఇదే విషయాన్ని చెప్పింది. అల్లు అర్జున్ తన సూపర్ హీరో అని చెప్పింది. వీళ్లిద్దరూ కలిసి 'సన్ ఆఫ్ సత్యమూర్తి'లో నటించారు. త్రివిక్రమ్ దర్శకత్వంలో వచ్చిన ఆ సినిమా చక్కని విజయాన్ని అందుకొంది. అలాగే సుకుమార్ డైరెక్షన్‌లో వచ్చిన 'పుష్ప'లో అల్లు అర్జున్, సమంత 'ఊ అంటావా..' పాటకు స్టెప్పులేశారు. ఈ పాట పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల్ని ఓ ఊపు ఊపింది.

Printed, Published and Owned by M.RAMESH, H.No. 87/-569, Ground floor, Madhavanagar, Kurnool City, Kurnool - 518002, Andhrapradesh State, and Printing at PSR Printers, No.87-569, Beside, Chenchureddy Apartment, Madhava nagar,Kurnool - 518002 District, Andhrapradesh, Published from H.No. H.No. 87/-569, Ground floor, Madhavanagar, Kurnool City, Kurnool - 518002, Andhrapradesh, Editor : M.RAMESH, Mob : 8008622746,E-mail : peoplesmotivation22@gmail.com